
సోవియట్ సమీక్ష



సంపుటి 4, నవంబరు 13

52 1970

á

సోవియట్ సమీక్ష

52 సంపుటి 4 నవంబరు 13 1970

ముఖ చిత్రం:

1970, నవంబరు 14, జవహర్లాల్ నెహ్రూ 81 వ జయంతి ఉత్సవ దినం.

సంపాదకుడు :

వి. ఆర్. కుల్లంద

మేనేజింగ్ సంపాదకుడు:

వై. యల్. ఫ్రొలోవ్

కళాకారుడు:

ఇ. తలనోవ్

9 భారతీయ భాషల్లో వెలువడే పత్రిక

మద్రాసులోని సోవియట్ దేశ కాన్సలేట్ జనరల్ కార్యాలయ సమాచారశాఖ (44, త్యాగరాయ రోడ్, మద్రాసు-17) తరపున యల్. వి. నరోకివ్ చే శ్రీ వేంకటేశ్వరా ప్రింటర్స్ మద్రాసు-21 లో ముద్రింపబడి, ప్రచురింపబడినది.

ఇందలి వ్యాసాలను పునర్ముద్రించే వారు మూలాన్ని పేర్కొంటే సంతోషిస్తాము

విషయసూచిక

భారత స్వాతంత్ర్యానికి రూపుదిద్దిన శిల్పి నెహ్రూ. అదే సమయంలో నిజంగా స్వతంత్రమూ, అలీనమూ అయిన విధానం అనుసరించి, విశ్వశాంతి కోసమూ, వలస విధానానికి వ్యతిరేకంగానూ సాగే పోరాటానికి తమ వంతు దోహదం కూర్చేందుకు తృతీయ ప్రపంచ దేశాలకు ఎంతగానో తోడ్పడి. ప్రపంచ ప్రాధాన్యం వహించిన గొప్ప అంతర్జాతీయతా వాదీ, రాజ్యతంత్రజ్ఞుడూ ఆయన. ఈ పోరాటంలో, సోవియట్ యూనియన్ సహజంగానే గట్టి మిత్ర దేశమని ఆయన తెలుసుకున్నారు. సోవియట్ యూనియన్ నిస్వార్థంగా అందజేసిన సహాయం, నూతన స్వతంత్ర దేశాల స్వతంత్రాభివృద్ధిలో ప్రాముఖ్యం వహించిన అంశం. సోవియట్ యూనియన్‌తో మైత్రిని, తన విదేశాంగ విధానంలో ఒక మౌలిక అంశంగా నెహ్రూ, సహజంగానే పరిగణించారు. నిజంగానే, సోవియట్-భారత మైత్రికి నెహ్రూ ఒక చిహ్నమయారు. నవంబరు 14 వ తేదీ, నెహ్రూ 81 వ జయంతి ఉత్సవ దినం. ఆ సందర్భంగా, ఈ సోవియట్ సమీక్ష సంచికలో, ఆయనను గురించి, ఎ. వాఫా రాసిన వ్యాసాన్ని ప్రచురిస్తున్నాము.

ఆఫ్రో-ఆసియా రచయితల నాలుగవ మహాసభ, ఈ నెల 16 న ఢిల్లీలో ప్రారంభమవుతుంది. 1958 లో తాష్కెంట్‌లో మొదటి మహాసభ జరిగినది మొదలుకొని, ఈ రచయితల ఉద్యమం, కళా, సాహిత్య రంగంలో ఒక గొప్ప శక్తిగా పెంపొందింది. ఆఫ్రో-ఆసియా రచయితల సోవియట్ సంధానక కమిటీ అధ్యక్షులైన కామిల్ యాషెన్ రాసిన వ్యాసాన్ని కూడా ఈ సంచికలో పాఠకులకు అందజేస్తున్నాము. సమాజంలో రచయిత పాత్రను గురించీ, ప్రపంచమంతటా అభ్యుదయ రచయితల నెదుర్కొంటున్న సిద్ధాంత, కళాసృష్టి సమస్యలను గురించీ, కామిల్ యాషెన్ తన వ్యాసంలో చర్చించారు.

—సంపాదకుడు

ఫ్రెడరిక్ ఎంగెల్స్ 150 వ జయంతి

ఫ్రెడరిక్ ఎంగెల్సుయొక్క సైద్ధాంతిక వారసత్వం

అకడమిషియన్ ప్యోతర్ ఫెదొసెయెవ్

మార్క్సిజం చరిత్రలో విషయంలో, ఫ్రెడరిక్ ఎంగెల్సు రచనలకుగల ప్రాముఖ్యాన్ని కొద్దిమాటల్లో చెప్పాలంటే, లెనిన్ మాటలను ఉటంకించడంకన్నా ఉత్తమమార్గం మరొకటిలేదు. "ఎంగెల్సు రచనలను అన్నిటినీ లెక్కలోకి తీసుకోనిదే, మార్క్సిజాన్ని పూర్తిగా అర్థం చేసుకోవడం గాని, పూర్తిగా వివరించడం గాని అసాధ్యమ"ని లెనిన్ అన్నారు.

శాస్త్రీయ కమ్యూనిజం చరిత్రలో, శ్రామికవర్గ విమోచనోద్యమ పరిణామ చరిత్రలో ఎంగెల్స్ పేరు, మార్క్స్ పేరునుండి విడదీయరానిది. పెట్టుబడిదారీ వ్యవస్థను నిర్మూలించి, నవసమాజాన్ని నిర్మించే మార్గాన్ని కార్మికవర్గానికి చూపగల శాస్త్రీయ సిద్ధాంతాన్ని రూపొందించేందుకు, ఈ సిద్ధాంతాన్ని కార్మికవర్గానికి ఒక ఆయుధంగా సమకూర్చేందుకు, సోషలిస్టు విప్లవ విజయసాధనకై వారిని సంఘటిత పరిచేందుకు, దాదాపు అర్ధ శతాబ్దం పాటు వారు నిర్విరామంగా కృషిచేశారు.

ఒకరికొకరు బ్రహ్మాండంగా సంపూర్ణతను సమకూర్చుకొన్న మహాప్రతిభాశాలురైన యిద్దరు చింతకుల సమిష్టికృషి ఫలితమే శాస్త్రీయ కమ్యూనిజమని, మార్క్స్ సమకాలికులకూ, ఆయన మిత్రులకూ, శిష్యులకూ ఆనాటికే తెలుసు; ఆ విషయాన్ని వారు గుర్తించారు కూడా. మార్క్స్, ఎంగెల్సుల యుగానికి మనం మరింత దూరమయేకొద్ది, వారి రచనలను యింకా ఎక్కువ తరచుగా ఆశ్రయించేకొద్ది, మార్క్సిస్టు సిద్ధాంతాన్ని రూపొందించేందుకూ, దానిని వ్యాపింప జేసేందుకూ, దానిని బలపరిచి, మరింత అభివృద్ధి పరచేందుకూ ఎంగెల్సు చేసిన సేవ ఎంత గొప్పదో, ఇంకా ఎక్కువ స్పష్టంగా గ్రహిస్తాము.

ప్రపంచ మంతటిలో సామాజిక శాస్త్రవేత్తలూ, ఆధునిక శ్రామికవర్గ బోధకులలోకెల్లా, ఎంగెల్స్ అత్యంత ప్రతిభాశాలి అని లెనిన్ అన్నారు. నిజంగానే

ఎంగెల్స్, తన జీవితాన్నంతటినీ, శ్రామికవర్గ ఆశయానికి. యావత్తు మానవజాతి విమోచన ఆశయానికి చైతన్యపూరితమూ, నిస్వార్థమూ అయిన సేవకే అంకితం చేశారు. శ్రామికుల దోపిడీపై నిప్పులు చెరిగే ఖండనలు, యువకుడైన ఎంగెల్స్ యొక్క తొలి రచనల్లోనే కనబడుతాయి.

కార్మికవర్గ పరిస్థితులనూ, పోరాటాన్నీ, ఎంగెల్స్ లోతుగా పరిశీలించారు; సామాజిక పరిణామ నియమాలను గ్రహించారు. ఫలితంగా, పాత సమాజానికి గోరీకట్టి, నవ సమాజాన్ని నిర్మించడం శ్రామికవర్గ చారిత్రక కర్తవ్యమన్న నిర్ధారణకు ఆయనా, మార్క్సు వచ్చారు. లెనిన్ యిలా నొక్కి చెప్పారు: "శ్రామికవర్గం బాధాగ్రస్త వర్గం మాత్రమే కాదనీ, నిజానికి శ్రామికవర్గం యొక్క అవమానకరమైన ఆర్థిక పరిస్థితే, దానిని, నిర్నిరోధంగా ముందుకునెట్టి, తన అంతిమ విముక్తికై పోరాడేలా చేస్తుందనీ, మొట్టమొదట చెప్పినవారు ఎంగెల్స్". కార్మికవర్గం యొక్క మౌలిక ప్రయోజనాలను వ్యక్తపరిచే మహోజ్వల బోధను, మార్క్సుతో కలిసి ఎంగెల్స్, శ్రామిక వర్గానికి ప్రసాదించారు.

కమ్యూనిజం, ఇప్పటికన్నా నిర్దుష్టమైన సమాజం అనే ఆదర్శం గురించిన ఊహాకల్పనలు కాదనీ, ఈ ఆదర్శంనుండి ఉద్భవించే పోరాటంయొక్క, శ్రామికవర్గం సాగిస్తూన్న ఈ పోరాటంయొక్క స్వభావమూ, పరిస్థితులూ, ఉమ్మడి లక్ష్యాలను గురించిన అవగాహనే కమ్యూనిజమనీ, ఎంగెల్స్ రాశారు. శాస్త్రీయ సోషలిజం వర్గాలతోనూ, కాలంతోనూ నిమిత్తంలేనిది అని చిత్రించేందుకూ, దాని శాస్త్రీయ భౌతికవాద ప్రాతిపదికను చూపించకుండా, "సోదరత్వం", "న్యాయం" అనే అస్పష్ట భావాలుగా దానిని చిత్రించేందుకూ జరిగిన ప్రయత్నాల నన్నిటినీ ఎంగెల్స్ సర్వదా, దీక్షతో ప్రతిఘటించారు.

మార్క్సిజం, విప్లవ శ్రామికవర్గం యొక్క ప్రపంచ దృక్పథం. చారిత్రక పరిణామక్రమాలను గురించిన దాని భావవ్యవస్థ యిది. పెట్టుబడిదారీ వ్యవస్థ కూలిపోవడమూ, నూతన సామాజికవ్యవస్థ విజయం సాధించడమూ అనివార్యమని యిది రుజువుచేస్తూంది. మార్క్సిజం ఒక శాస్త్రం. ఎందువల్లనంటే, భౌతిక పరిణామ నియమాలను ఇది వివరిస్తూంది. సమాజాన్ని విప్లవాత్మకంగా పునర్వ్యవస్థీకరించడంలో ఈ నియమాలను ఎలా అన్వయింపజేయాలో బోధిస్తూంది.

కార్మికోద్యమ సైద్ధాంతిక వ్యక్తీకరణ అయిన మార్క్సిజంలోని శాస్త్రీయ అంశాలకూ, తాత్విక అంశాలకూ మధ్యగల ఈ ఏకత, సిద్ధాంత, ఆచరణ రంగాల్లోని ఎంగెల్స్ కార్యకలాపాలన్నిటిలోనూ తొణికిసలాడుతూంది.

మార్క్సిస్టు సిద్ధాంత అంతర్భాగాలన్నిటినీ రూపొందించడంలోనూ, విపులీకరించడంలోనూ ఎంగెల్స్ చేసిన సేవ, ప్రత్యేకించి గొప్పది. శాస్త్రీయ కమ్యూనిస్టు భావాలను వ్యాపింపజేయడంలోనూ, వాటిని ప్రచారం చేయడంలోనూ, వక్రీకరణల బారినుండి

వాటిని కాపాడడంలోనూ ఆయన చేసిన సేవకు కూడా ఇంత ప్రాముఖ్యమూ వుంది. వివరించడంలో ఎంగెల్స్, గణనీయంగా తోడ్పడని సమస్య మార్క్సిజంలో ఒక్కటి కూడా లేదని, మనం ఖచ్చితంగా చెప్పవచ్చు. శాస్త్రీయ కమ్యూనిజం మూలపురుషుల మధ్య నడిచిన ఉత్తర ప్రత్యుత్తరాలు యిందుకు ఉత్తమ నిదర్శనం. సిద్ధాంతానికీ, ఎత్తుగడలకూ సంబంధించిన ముఖ్యసమస్య లన్నిటి విషయంలోనూ మార్క్స్, ఎంగెల్సుల మధ్య సృజనాత్మక సహకారాన్ని ఈ ఉత్తర ప్రత్యుత్తరాలు విశదం చేస్తున్నాయి.

మార్క్స్ చనిపోయిన తరువాత ఎంగెల్స్ కృషి ప్రాధాన్యం ఇనుమడించింది. మార్క్సిస్టు సిద్ధాంతంపట్ల పిడివాద, రివిజనిస్టు ధోరణులను ఎదుర్కొని, ఎంగెల్స్, దాని మౌలిక సూత్రీకరణలను బలపరిచారు. అంతేకాకుండా, పారిస్ కమ్యూన్ ఓటమి అనంతరం యూరప్‌లో ఏర్పడిన కొత్త పరిస్థితుల్లో వాటిని మరింత ముందుకు తీసుకుపోయారు. మార్క్స్ అసంపూర్తిగా వదలిపెట్టిన "కాపిటల్" రెండవ, మూడవ సంపుటాలను ప్రచురణకు సిద్ధం చేయడంలో ఎంగెల్స్ సాగించిన కృషి, శాస్త్రరంగంలో నిజంగా ఒక ఘనకార్యం. మార్క్స్ రాతప్రతులను క్రమపద్ధతిలో అమర్చేందుకూ, ఆ గ్రంథాన్ని పూర్తిచేసేందుకూ ఆయన ఎన్నో సంవత్సరాలు దీక్షతో పాటుపడ్డారు. మహానుభావుడైన తనమిత్రుని మహత్తర రచనను ఎంగెల్స్ ఎంతో సముచితంగా పూర్తిచేశారు.

ప్రపంచ సామాజిక చింతన, సంస్కృతి, శాస్త్రాల తలమానికమూ, విమర్శనాత్మకమూ, విప్లవతత్వ పూరితమూ అయిన మార్క్సిజం, నిరంతరంగా అభివృద్ధి చెందుతూనే ఉంటుంది. దీని మూలపురుషుల కార్యకలాపాలన్నిటిలోనూ సాటిలేని శాస్త్రీయ దృష్టి, తాము పరిశోధనచేసి కనుగొన్న వాటిపట్ల కూడా విమర్శనాత్మక వైఖరీ, కాలదోషం పట్టిపోయిన అభిప్రాయాలను విసర్జించగల సామర్థ్యమూ, జీవితంలోను, శాస్త్రరంగంలోను, విప్లవోద్యమంలోను కొత్త పోకడలను అవగతం చేసుకోగల అద్భుతమైన గ్రహణశక్తీ కొట్టవచ్చినట్లు కనబడుతుంది.

మొత్తం పెట్టుబడిదారీ వ్యవస్థలోనూ, విడివిడిగా ఆయా దేశాల్లోనూ పెట్టుబడిదారీ ఆర్థిక, రాజకీయరంగాల పరిణామంలో పొడసూపిన కొత్త ధోరణుల నన్నిటినీ ఎంగెల్స్ శ్రద్ధతో గమనిస్తూ వచ్చారు. సామ్రాజ్యవాదానికి పూర్వపు యుగంలోని కొన్ని ప్రత్యేక లక్షణాలను (బడా గుత్తపెట్టుబడిదారీ సంస్థలు ఏర్పడడం, ద్రవ్య పెట్టుబడుల పాత్ర, ప్రపంచాన్ని వలస దేశాలుగా ముక్కచెక్కలు చేయడం) గమనించి, ఆయన మార్క్సిస్టు సిద్ధాంతానికి మరికొంత పరిపుష్టిని చేకూర్చారు. సామాజిక సంస్కరణవాద దృష్టితో ఈ నూతన పరిణామాలను వ్యాఖ్యానించేందుకూ, వీటివల్ల, శ్రామికవర్గ విప్లవ అవసరం లేకుండా పోతున్నదని వాదించేందుకూ జరిగిన ప్రయత్నాల నన్నిటినీ ఎంగెల్స్ వ్యతిరేకించారు.

II

మార్క్సిజంలోని తాత్విక అంశాలను మరింత ప్రగాఢ మొనర్చడంపట్ల, మరింత విపులీకరించడం పట్ల ఎంగెల్స్ అపారమైన శ్రద్ధ వహించారు. నికరమైన గతితార్కిక భౌతికవాదంకోసం ఆయన పోరాడారు. ఇది యాదృచ్ఛిక మేమీ కాదు. ఎందువల్లనంటే, ఎంగెల్స్ దృష్టిలో గతితార్కిక భౌతికవాదం, ప్రపంచాన్ని అవగతం చేసుకోడానికీ, మార్చడానికీ బలవత్తరమైన ఆయుధమూ, అంతర్జాతీయ కార్మికోద్యమం యొక్క శాస్త్రీయ వ్యూహానికీ, ఎత్తుగడలకూ మూలాధారమున్నూ. *"యాంటీ డూరింగ్"*, *"ప్రకృతి గతితర్కం"*, *"లుడ్విగ్ ఫ్యూర్‌బాచ్, జర్మన్ ప్రాచీన తత్వశాస్త్ర అవసానం"* అన్న తన ముఖ్య తాత్వికరచనల్లో ఎంగెల్స్, తత్వశాస్త్రానికీ, దాని మౌలిక సమస్యకూ ప్రామాణిక నిర్వచనం ప్రసాదించారు, భౌతిక గతితర్కం యొక్క ముఖ్యలక్షణాలనూ, నియమాలనూ వెల్లడిచేశారు, ప్రకృతియొక్క, సమాజంయొక్క పరిణామక్రమాల పరిశోధనకు ఇది ఎంత ముఖ్యమో తెలియజేశారు. మానవ విజ్ఞానానికి చెందిన వివిధ రంగాలను (చరిత్ర, భాషాశాస్త్రం, మానవునియొక్క, మానవ సమాజం యొక్క పుట్టుక, సైనిక వ్యవహారాలు, ప్రకృతిశాస్త్రం) వివేచన చేయడంలో ఆయన, మార్క్సిస్టు గతితార్కిక పద్ధతిని అతిచాకచక్యంతో వుపయోగించారు. గతితార్కిక భౌతిక వాద పద్ధతిని గనుక సమర్థతతో ఉపయోగిస్తే, ప్రకృతి శాస్త్రాలకూ, సామాజిక శాస్త్రాలకూ సంబంధించిన అతి గడ్డు సమస్యలను కూడా పరిష్కరించడం సాధ్యమని ఎంగెల్స్ స్పష్టం చేశారు. భౌతికవాద గతితర్కాన్ని ఉపయోగించడం ద్వారా పరిష్కరించగలది, ఈ సమస్యలను మాత్రమేకాదనీ, మార్క్సిస్టు గతితార్కిక పద్ధతిని శాస్త్రవేత్తలు దీక్షతో ఆకళించుకున్నప్పుడు మాత్రమే విజ్ఞానశాస్త్రం ఫలప్రదంగా అభివృద్ధి కాగలదనీ, ఎంగెల్స్, అపారమైన నిర్దిష్ట విషయ సంపదను ఆధారంచేసుకొని నిరూపించారు. ప్రపంచాన్ని అర్థం చేసుకోవడంలో సైద్ధాంతికచింతన పాత్రను, అంటే, సరియయిన తాత్విక పద్ధతి పాత్రను ఎంగెల్స్ నిరూపించారు.

మార్క్సిజం అవతరించినది మొదలుకొని, గతితార్కిక భౌతికవాద తత్వశాస్త్రమూ, ఆయా శాస్త్రాలూ పరస్పరం ప్రాభావిత మొనర్చుకొనే పరిణామక్రమ మొకటి ప్రారంభ మయింది. ఈ క్రమంలో, మార్క్సిజంలోని ఆయా అంశాలు సరియయినవని అధికాధి కంగా నిరూపితమయింది; మార్క్సిజం మరింత వికసించింది (ముఖ్యంగా, సమాజ చరిత్రను గురించిన ఎంగెల్స్ రచనల్లోను, ఆయన రచించిన "ప్రకృతి గతితర్కం"లోను). అంతేకాదు. విజ్ఞానశాస్త్ర పరిశోధనల్లో ఉపయోగించే పరిశీలనా పద్ధతికి ఆధారంగా, భౌతిక వాద గతితర్కాన్ని జీర్ణించుకోవలసిన అవసరాన్ని, అభివృద్ధికాముక శాస్త్రవేత్తలు, క్రమ క్రమంగా గుర్తించ నారంభించారు.

గతితార్కిక భౌతికవాద తత్వశాస్త్రానికీ, ఆధునిక ప్రకృతి శాస్త్రానికీ మధ్య ఏకత

ఉండాలన్న లెనిన్ భావన, గతితార్కిక పద్ధతిని శాస్త్రవేత్తలు అవగతం చేసుకోవడం అవసరమూ, ప్రయోజనకరమూ అన్న ఎంగెల్స్ అభిప్రాయానికి సహజ పర్యవసానమే. లెనిన్ భావన ఎంత ప్రయోజనకరమైనదో, గత అర్ధశతాబ్దంలోని ప్రకృతిశాస్త్రాల ప్రగతి అమోఘంగా నిరూపించింది.

చాలసరిగా గతాన్ని వ్యాఖ్యానించేందుకూ, వర్తమానాన్ని వివేచన చేసేందుకూ, భవిష్యత్తును శాస్త్రీయంగా ముందుగానే ఊహించేందుకూ భౌతికవాద గతితర్కం అవకాశం కలిగిస్తుంది. ఇదే దీనికున్న బలం. ఈ భవిష్యత్తు ఎలాంటిదో, పిడివాదదృష్టితో ఊహించడానికి మార్క్స్, ఎంగెల్సులు ప్రయత్నించ లేదు. అలాకాకుండా, వాస్తవంగా వున్న సామాజిక పరిణామ ధోరణులను ఆధారంచేసుకొని వారు, కమ్యూనిస్టు సమాజాన్ని శాసించే ముఖ్యలక్షణాలనూ, నియమాలనూ నిర్దేశించారు. 1880, 1890 దశకాల్లో ఎంగెల్స్ ఈ విషయంపట్ల ప్రత్యేకశ్రద్ధ వహించారు. కార్మికోద్యమం ఉరవడిగా అభివృద్ధిచెందుతూ ఉండడంవల్ల, ఆ ఉద్యమ లక్ష్యాలకు సంబంధించిన అనేక సమస్యలకు పరిష్కారమూ, సమాజ భవిష్యత్తును గురించిన పెట్టీబూర్జువా, ఒంటెత్తు భావాలను పూర్వపక్షం చేయడమూ అవసరమైన కాల మది.

సోషలిస్టు సమాజం "శాశ్వతమైన దేమీకాదనీ, తక్కిన సామాజికవ్యవస్థ లన్నిటి లాగానే అది కూడా నిరంతరం మారుతూ, పరివర్తన చెందుతూ వుంటుందనీ నేను భావిస్తున్నాను" అని 1880 లో ఎంగెల్స్ రాశారు. అందుచేత, భావి సమాజంయొక్క పరిణామం పట్ల శాస్త్రీయవైఖరిని అవలంబించడంలో, ఈ పరిణామం గతంతో ఎక్కడ విభేదిస్తుందో నిర్ణయించడమూ, భౌతిక ధోరణుల వివేచనను ఆధారంచేసుకొని, ఈ పరిణామంయొక్క సార్వత్రిక గమ్యాన్ని ముందుగానే ఊహించడమూ గర్భితం. ఈ క్రమం అంటే ప్రధానంగా, కమ్యూనిస్టు సమాజ స్థాపనకూ, దాని విధినిర్వహణకూ సంబంధించి తెలుసుకొన్న నియమాలను, విజయం సాధించిన శ్రామికవర్గం చైతన్యపూర్వకంగా అమలు జరపడమే అని, ఎంగెల్స్ భావించారు. ఈ కారణంచేతనే, సోషలిస్టు నిర్మాణంలోకి మేధావులను కూడా ఆకర్షించడానికి ఎంగెల్స్ ప్రాధాన్యమిచ్చారు.

సోషలిజంలో సామాజిక ఉత్పత్తి వ్యవస్థీకరణ, సోషలిస్టు రాజ్యాంగ వ్యవస్థపాత్ర, విధులు, సోషలిజంలో సామాజిక సంబంధాల పరిణామం, కమ్యూనిస్టు నీతి అంతస్సారం, కుటుంబ పరిణామం మొదలైనవాటిని గురించి గభీరభావాలను ఎంగెల్స్ తన రచనల్లో వ్యక్తపరిచారు. ఈ భావాలు ఎంత శాశ్వత ప్రాధాన్యం గలవో, సోషలిస్టు నిర్మాణంలో సోవియట్ దేశంయొక్క, తక్కిన సోషలిస్టు దేశాలయొక్క చరిత్రాత్మక అనుభవం ధ్రువీకరిస్తూంది.

చైతన్యయుతమూ, లక్ష్యశుద్ధిగల క్రమమైన భావి సమాజనిర్మాణంలో, వ్యక్తియొక్క, సమాజంయొక్క ప్రయోజనాలను పొందికగా జోడించడం గర్భితమని ఎంగెల్స్

భావించారు. ఈ విషయంలో అన్నిరకాల ప్రత్యేకతా ధోరణులనూ ఆయన ఖండితంగా వ్యతిరేకించారు. పెట్టీబూర్జువా వ్యక్తివాదం ఈ ధోరణులకు మూలం. "కమ్యూనిస్టు ఆర్థిక వ్యవస్థకు పరివర్తన దశలో, మధ్యంతర ప్రక్రియగా సహకార ఉత్పత్తి ప్రక్రియనువిస్తృతంగా ఉపయోగించడం అవసరమవుతుందన్న విషయాన్ని మార్క్సు, నేనూ ఏనాడూ శంకించలేదు. కాని, సహకారసంఘం ప్రత్యేక ప్రయోజనాలు, మొత్తం సమాజం ప్రయోజనాలకన్నా పైచేయి సంపాదించకుండా ఉండేందుకై, ఉత్పత్తి సాధనాలపై యాజమాన్యం సమాజం చేతిలో ఉండేలాగా, ఆ కారణాన మొదట రాజ్యాంగ వ్యవస్థ చేతిలో ఉండేలాగా, చూడాలి" అని ఎంగెల్స్ రాశారు.

అయితే, ఒక విషయాన్ని ఎంగెల్సు అర్థం చేసుకున్నారు. అదేమిటంటే, సోషలిస్టు నిర్మాణంలో వివిధ వర్గాల, సామాజిక సముదాయాల భాగస్వామ్యానికి ప్రత్యేక పరిస్థితులు అవసరం; వీటిని దృష్టిలోకి తీసుకోవాలి. అందుచేత, శ్రామిక రైతు జనబాహుళ్యాన్ని కార్మికవర్గంవైపు ఆకర్షించడమూ, శ్రామిక రైతాంగాన్ని క్రమక్రమంగా సోషలిస్టు పద్ధతుల్లోకి తేవడమూ అవసరమని చెబుతూనే మరొక విషయాన్నికూడా ఎంగెల్స్ నొక్కి చెప్పారు. రైతాంగంపట్ల సానుభూతితో వ్యవహరించాలి, సహకార వ్యవహారాల్లో వారికి నిర్దిష్టమైన సహాయం అందజేయాలి, వారి మనస్తత్వాన్ని తగువిధంగా లెక్కలోకి తీసుకోవాలని అన్నారు. "సన్నకారు రైతుస్థితిని కొంత మెరుగుపరచడానికీ, వారు నిశ్చయించుకొన్నట్లయితే, ఉమ్మడి వ్యవసాయపద్ధతికి, పరివర్తన చెందేందుకు వీలు కల్పించడానికీ, అటువంటి నిర్ణయానికి యింకా రాలేకుండా ఉన్నట్లయితే, సాకల్యంగా ఆలోచించుకునేందుకు వారికి వ్యవధి యివ్వడానికీ మనం చేయగలదంతా చేస్తాము" అని, సన్నకారు రైతు గురించి ప్రస్తావిస్తూ ఎంగెల్స్ రాశారు. ఎంగెల్స్ ప్రతిపాదించిన యీ మౌలిక భావాలను లెనిన్, తన సహకార పథకంలో యింకా ముందుకు తీసుకుపోయారు. సోషలిస్టు మార్గాన్ని చేబట్టిన గ్రామసీమలో నవసమాజ నిర్మాణంలోకి రైతాంగాన్ని ఆకర్షించడంలో యివి ప్రదర్శితమయాయి.

మార్క్సిస్టు సిద్ధాంతాన్ని నిరంతరాయంగా అభివృద్ధిపరచడం, కార్మికోద్యమానికీ, ఆ ఉద్యమ వ్యూహాన్నీ, ఎత్తుగడలనూ శాస్త్రీయంగా రూపొందించడానికీ, నానారూపాల పెట్టీబూర్జువా సోషలిజాన్నీ, మితవాద, "అతివాద" అవకాశవాదాన్ని జయప్రదంగా తిప్పికొట్టడానికీ ఎంతైనా ముఖ్యం. మార్క్సిస్టు సిద్ధాంతమూ, కార్మికోద్యమమూ పరస్పరం ప్రసరించుకున్న ప్రభావమూ, పరస్పరం పరిపుష్టిని చేకూర్చుకోవడమూ, ఆ రెండూ కలిసి ఆ సిద్ధాంతాన్ని మరింత మెరుగుపరచడానికీ, ఆ ఉద్యమాన్ని మరింత అభివృద్ధి పరచడానికీ, దాని వర్గ చైతన్యమూ, నిర్మాణమూ మరింత ఉన్నతస్థాయి నందుకోడానికీ దారితీశాయి.

III

శాస్త్రీయ ఆధారాలుగల సరియయిన కార్మికోద్యమ కార్యక్రమం ప్రాధాన్యాన్ని నొక్కిచెబుతూ ఎంగెల్సు ఒక విషయం రాశారు. "నిజంగా సార్వత్రికమైన ప్రతి ఒక్క కార్మికోద్యమంలోనూ కమ్యూనిస్టులు పాల్గొనాలి, ఆ ఉద్యమం ప్రారంభం కావడానికి వాస్తవకారణాన్ని ఉన్న దున్నట్లుగానే స్వీకరించి, ప్రతి ఒక్క పొరపాటూ, ప్రతి ఒక్క అపజయమూ, ఆది కార్యక్రమంలోని పొరపాటు సైద్ధాంతిక సూత్రీకరణల అనివార్య పర్యవసానాలే అని స్పష్టం చేయడంకోసం, క్రమక్రమంగా దానిని సైద్ధాంతిక స్థాయికి తీసుకువెళ్ళాల"ని అన్నారు.

కార్మిక పార్టీల ప్రజాప్రాతిపదిక విస్తృతమైన పరిస్థితుల్లో, తమ తమ భావాలూ, ఆశయాలతో పెట్టీబూర్జువా వర్గీయులూ, రైతులూ పెద్దసంఖ్యలో సభ్యులుగా చేరుతూన్న పరిస్థితుల్లో, సైద్ధాంతిక స్పష్టతా, సరియైన పోకడా ప్రత్యేకించి ముఖ్యమైనవి. పెట్టీ బూర్జువా సిద్ధాంతాన్ని ఎదుర్కొని సాగించవలసిన పోరాటాన్ని తక్కువ అంచనా వేయ కూడదని హెచ్చరిస్తూ, "ఈ భావాలూ, ఆశయాలపట్ల కార్మికవర్గం రాజీ వైఖరిని గనుక అవలంబించినట్లయితే, అది, చరిత్రాత్మకమైన తన నాయకపాత్రను నిర్వహించజాలదు" అని ఎంగెల్స్ నొక్కి చెప్పారు.

శ్రామికవర్గ పార్టీల వ్యూహమూ, ఎత్తుగడలను శాస్త్రీయంగా రూపొందించడం లోనూ, కార్మికోద్యమానికి ఆచరణపూర్వక నాయకత్వం వహించడంలోనూ ఎంగెల్సు వహించిన పాత్ర ప్రత్యేకించి గొప్పది. మార్క్సు మరణానంతరం, యూరప్ దేశాల సోషలిస్టులకు సలహాలు యిస్తూ, నాయకత్వం వహిస్తూ వచ్చినది ఆయన ఒక్కరే అని లెనిన్ అన్నారు. అంతర్జాతీయ కార్మికోద్యమంలో ఎంగెల్సు యొక్క కార్యకలాపాలన్నీ కూడా, శ్రామికవర్గ అంతర్జాతీయతా సూత్రాల విజయంకోసం సాగించిన పోరాటంతో నిండివున్నాయి. శ్రామికవర్గ విముక్తి అనేది అంతర్జాతీయతా ప్రాతిపదిక పైనే సాధ్యమని ఆయన, కార్మికోద్యమంలో చురుకుగా పాల్గొంటున్న వారికి రాసిన లేఖల్లోనూ, వ్యాసా ల్లోనూ, ప్రసంగాల్లోనూ పదే పదే, నికరంగా నొక్కి చెప్పారు. కార్యాచరణకు, విధానానికి మధ్య ఏకత ఉండాలని ఆయన అన్నారు.

కార్మికవర్గంయొక్క వివిధ దళాల ఐక్య కార్యాచరణను సాధించాలంటే, తరుణ కార్మికపార్టీలలో అంతర్జాతీయతా తత్వాన్ని నాటి పెంచడం అవసరమని ఎంగెల్స్‌కు తెలుసు. అందుచేత ఆయన, బూర్జువా జాతీయతను, అది ఏరూపంలో వున్నా ఎదుర్కొని నిర్విరామంగా పోరాడారు, కార్మికోద్యమంయొక్క ఉమ్మడి కర్తవ్యాల విస్మరణను దీక్షతో ప్రతిఘటించారు; అదేసమయంలో, ఈ ఉద్యమ దళాల్లోని కొన్నిటి స్వతంత్ర స్వభావాన్ని నొక్కి చెప్పారు.

ఎంగెల్స్, అంతర్జాతీయ కార్మికోద్యమ ఐక్యత రూపాల సమస్యను, నిర్దిష్ట పరి

స్థితులను లెక్కలోకి తీసుకొని, గతితార్కిక దృష్టితో ఎదుర్కొన్నారు. అయితే, శ్రామికవర్గ అంతర్జాతీయసంస్థ ఉందా, లేదా అన్నదానితో నిమిత్తంలేకుండా, ఐక్య కార్యాచరణను నిలబెట్టుకొని, పటిష్ట మొనర్చుకోవాలనీ, అటువంటి సంస్థ లేనంతమాత్రాన, తక్కిన దేశాల్లోని తమ సోదరులపట్ల వర్గ ధర్మాలను నెరవేర్చవలసిన బాధ్యత కార్మిక పార్టీలకు లేకుండాపోదనీ, కార్మిక పార్టీల నాయకులకు ఆయన, పదే పదే తెలియజేశారు.

శ్రామికవర్గ పార్టీల పరస్పర సమన్వయపూర్వక కార్యాచరణ అవసరం గురించి చెబుతూ, ఎంగెల్స్, ప్రతి ఒక్క అంతర్జాతీయ కార్యాచరణకూ ముందు, దాని అంతస్సారమూ, రూపాలను గురించి తప్పనిసరిగా ఒక అంగీకారం కుదుర్చుకోవాలని స్పష్టం చేశారు. సహజంగానే, ఐక్య కార్యాచరణ అవసరం ఉన్నంతమాత్రాన, కొన్ని అభిప్రాయ భేదాలూ, ప్రత్యేక వైఖరులూ, వివాదాస్పదమైన సమస్యలూ ఉండడానికి అవకాశం లేకుండా పోదు. ఒక ముఠాగా దిగజారిపోకుండా ఉండాలంటే, చర్చలను అనుమతించాలనీ, అయితే, సార్వత్రిక సూత్రాలను అచంచలంగా పాటించాలనీ, ఎంగెల్స్ తెలిపారు. ఈ సార్వత్రిక సూత్రాలను, మార్క్సిస్టు సిద్ధాంతానికి మౌలిక మైనవిగా ఎంగెల్స్ పరిగణించారు. శాస్త్రరంగంలోని అభివృద్ధుల అనుభవసంపదనే కాకుండా, ఎన్నో త్యాగాలు చేసి, పరాజయాలూ, పొరపాట్లూ, ఊగిసలాటలను ఎన్నిటినో చవిచూచి కార్మికోద్యమం సముపార్జించిన చారిత్రక అనుభవ సంపదను కూడా ఈ సూత్రాలు తమలో పొదివికొన్నాయని ఆయన స్పష్టం చేశారు. అందుచేత, శాస్త్రీయ కమ్యూనిజం పునాదులకు ఏమాత్రం దూరం కావడాన్నీ ప్రతిఘటించి, ఎంగెల్స్ దీక్షతో పోరాడారు. తొందరపాటు కొద్దీ సైద్ధాంతిక వాదనలను ముందుకుతెచ్చి, విప్లవంలోని మధ్యంతర దశలను దాటవేయజూచి, అన్నివిధాల రాజీలను నిరాకరించే శోచనీయమైన "విప్లవకారుల"ను ఆయన, నిర్విరామంగా అపహాస్యం చేశారు. మహత్తరమైన అంతిమ లక్ష్యాన్ని కనుమరుగు కానివ్వరాదనీ, ఆయా తక్షణ విజయాలను పాక్షిక లాభాలుగానే పరిగణించాలనీ, కేవలం ఒక దశ మాత్రమే అయిన దానిని ఉద్యమం యొక్క అంతిమలక్ష్యంగా పరిగణించరాదనీ ఆయన, సోషలిస్టులను ఉద్బోధించారు.

కార్మికులపార్టీ రాజీకి అంగీకరించ వచ్చుననీ, అయితే, అందువల్ల పార్టీయొక్క శ్రామికవర్గ స్వభావానికి భంగం కలుగకుండా వుండే షరతుపైనే అలా జరగవచ్చుననీ, ఎంగెల్స్ తెలిపారు. పోరాటరూపాలూ, సాధనాలూ, మార్గాల్లో—శాంతియుతమా, తద్భిన్నమా—ఏది ఎన్నుకోవాలన్నది ఆయా నిర్దిష్ట పరిస్థితిపై ఆధారపడి వుంటుంది. "ఈ నిర్దిష్ట పరిస్థితిలో శాంతియుత, చట్టబద్ధ సాధనాలను ఉపయోగించడమూ, సంఘర్షణకు ఏలాంటి సాకూలేకుండా చేసుకోవడమూ అత్యవసరమని మీతో అంగీకరిస్తున్నాను. అయితే, ఎటువంటి రూపంలోనూ, ఏలాంటి పరిస్థితిలోనూ బలప్రయోగం కూడదని మీరు సాగించిన వాదనలు అంగీకరించ తగినవికావు. దయాళువులైన క్వేకర్ మతస్థుల్లాగా కుడి చెంపపై ఎవరైనా కొడితే, ఎడమ చెంపను కూడా అందివ్వాలని మేమెన్నడూ అనుకో

లేదు" అని ఎంగెల్స్, తన మరణానికి కొద్ది సంవత్సరాలకు ముందు, జర్మన్ సోషల్ డెమొక్రటిక్ నాయకుల్లో ఒకరికి జాబు రాస్తూ తెలిపారు. అయితే ఇంత చెప్పినప్పటికీ, బలప్రయోగం అన్ని పరిస్థితుల్లోనూ విప్లవకరమైనదే, అది ఎన్నటికీ అభివృద్ధి నిరోధకం కాదు అనే దృక్పథాన్ని ఎంగెల్స్ నిరాకరించారు. అభివృద్ధినిరోధకమైన బలప్రయోగం లేనప్పుడు, విప్లవకరమైన బలప్రయోగం వుండే సమస్యే లేదని ఆయన స్పష్టం చేశారు. అభివృద్ధి నిరోధకమైన బలప్రయోగాన్ని ప్రతిఘటించి తీరవలసిందే.

సకల అభివృద్ధికాముక శక్తులకూ అగ్రదళంగా నిలవాలనీ, ప్రజాస్వామిక ఉద్యమాలను బలపరచాలనీ, పెట్టుబడిదారీ వ్యతిరేక సార్వత్రిక పోరాట వెల్లువలోకి ఈ ఉద్యమాల నన్నిటినీ మళ్ళించాలనీ, తరుణ కార్మిక పార్టీలను ఎంగెల్స్ ఉద్బోధించారు. 19 వ శతాబ్ది చివరిరోజుల్లో పెచ్చు పెరుగుతూన్న సైనికతత్వమూ, ఆయుధపోటీ, ప్రత్యేక ప్రమాదాన్ని తెచ్చిపెట్టాయి. యుద్ధ ప్రమాదానికి వ్యతిరేకంగా పోరాటం సాగించడం, కార్మిక పార్టీల మౌలిక లక్ష్యంగా ఎంగెల్స్ పరిగణించారు. అయితే, అస్పష్ట సాత్విక వాదానికీ ఆయన దృక్పథానికీ సామ్యం ఏమీ లేదు. విజయం సాధించే శ్రామికవర్గం రక్షణ యుద్ధాలను సాగించడం అవసరం కావచ్చునని కూడా ఆయన భావించారు.

మార్క్సిస్టు సిద్ధాంతాన్ని రూపొందించేందుకు నిర్విరామకృషి సాగించడం ద్వారా, కార్మికోద్యమంలో శాస్త్రీయ కమ్యూనిస్టు సూత్రాల విజయంకోసం, శ్రామికవర్గ అంతర్జాతీయతా సూత్రాల విజయంకోసం పోరాటం సాగించడంద్వారా ఎంగెల్స్, సకల అభివృద్ధి కాముక మానవాళియొక్క కృతజ్ఞతనూ, ఆ మానవాళి శత్రువుల ద్వేషాన్నీ చూరగొన్నారు. మార్క్సుకి వక్రభాష్యాలు కల్పిస్తున్నారని, మార్క్సిస్టు వ్యతిరేకులు ఆయనపై నేరారోపణ చేశారు. "దయాళువైన మార్క్సుని దుష్టుడైన ఎంగెల్స్ చెడగొట్టాడన్న కట్టుకథను—1844 మొదలుకొని నిరంతరంగా వల్లిస్తూవచ్చిన కట్టుకథను" ఎంగెల్స్, పదే పదే అపహాస్యం చేశారు.

విప్లవ సిద్ధాంత అభివృద్ధికీ, నిరంతర పరిపుష్టికీ సంబంధించిన ఏకైక, నియమబద్ధ క్రమాన్నీ, గతంలో సరియైనదే అయినప్పటికీ, సమకాలిక వాస్తవానికి యిక అనుగుణం కాని వాటినన్నిటి నిరాకరణనూ, మార్క్సిజం చరిత్ర ప్రతిబింబిస్తున్నదన్న విషయాన్ని, సిద్ధాంత, ఆచరణరంగాల్లో ఫ్రెడరిక్ ఎంగెల్స్ సాగించిన బహుముఖ కార్యకలాపాలు, తిరుగులేని విధంగా నిరూపిస్తున్నాయి. అందుచేత, మార్క్సిస్టు సిద్ధాంతంలో ఏదో ఒకలాంటి పరస్పర వైరుధ్యాలను "కనిపెట్టేందుకు" వక్రభాష్యకారులు చేసే ప్రయత్నాలన్నీ కూడా నిరాధారమూ, నిరర్థకమున్నూ. మార్క్సిజం ఒకే ఉక్కు తునకతో మలిచినదని లెనిన్ అన్నారు. మార్క్సిజంలోని ఒక అంతర్భాగాన్ని మరొక అంతర్భాగానికి పోటీ పెట్టేందుకు, తరుణ మార్క్సుని పరిణత మార్క్సుకూ, మార్క్సుని

ఎంగెల్స్‌కూ, మార్క్స్ ఎంగెల్సులను లెనినుకూ పోటీపెట్టేందుకూ చేసే ప్రయత్నాలన్నీ విఫలంకాక తప్పదు.

మార్క్సిజం-లెనినిజం యొక్క సర్వసమగ్రతా, ఏకరీతీ, దాని అంతర్భాగాలన్నిటి యొక్క అంతర్గత ఏకతనూ, సిద్ధాంత పద్ధతుల సంపూర్ణ ఏకతనూ వ్యక్తపరుస్తున్నాయి. విప్లవకర గతితర్కం, మార్క్సిజం-లెనినిజానికి జీవధాతువు. సకల విషయాలనూ, వాటి పరస్పర ప్రభావాన్నిబట్టి, పరిణామాన్నిబట్టీ, పరిశీలించాలని, అంటే, ఉత్పన్నమయే సమస్యల పరిష్కారంపట్ల సృజనాత్మక వైఖరిని అవలంబించాలని అది ఆదేశిస్తుంది.

కారల్‌మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్సుల విశ్వాసపాత్రుడైన అనుచరుడూ, వారి ఆశయాన్ని చిరస్థాయిగా చేసినవారూ అయిన వ్లాదిమిర్ ఇల్యిచ్ లెనిన్ సిద్ధాంత, ఆచరణ రంగాల్లో సాగించిన కార్యకలాపాల్లో, మార్క్సిజం యొక్క ఈ జీవధాతువూ, దాని, అపారమైన సృజనాత్మకశక్తి సామర్థ్యాలూ గర్భితమై వున్నాయి.

(త్రుద్, సెప్టెంబరు 1.)

సోవియట్ కమ్యూనిస్టు పార్టీ 24 వ మహాసభకు పురోగమనం

సోషలిజమూ, మానవ శ్రమ

ఆర్. కొసొలపొవ్

మన దేశంలో కమ్యూనిజానికి పాదార్థిక సాంకేతిక పునాదిని నిర్మించటమనేది, శాస్త్ర-సాంకేతిక ప్రగతివేగాన్ని పెంచటంతో, సామాజికోత్పత్తిని మరింత ఉధృత పరచటంతో, దాని సామర్థ్యాన్ని పెంచటంతో విడదీయరాని విధంగా ముడిపడి వుంది. శ్రామిక ఉత్పాదక శక్తిని గణనీయంగా పెంచటమనే కర్తవ్యాన్ని సోవియట్ ప్రజలు నెరవేరుస్తున్నారు. అభివృద్ధి చెందిన సోషలిస్టు సమాజం యొక్క ఆంతరంగిక అవసరాల మూలంగానూ, పెట్టుబడిదారీ విధానంతో జరిగే ఆర్థిక పోటీలో దాని విజయానికి హామీ కల్పించవలసిన ఆవశ్యకత మూలంగానూ ఈ కర్తవ్యం ఉత్పన్నమైంది.

సోషలిస్టు నిర్మాణక్రమంలో, తొలి పంచవర్ష ప్రణాళికలు అమలు జరిగిన సంవత్సరాలలోనే, మన దేశ శ్రామిక ప్రజలు, విప్లవానికి పూర్వపు రష్యాలో వుండిన శ్రామిక ఉత్పాదకశక్తి స్థాయిని మించిపోయారు. తద్వారా, తమ దేశ సరిహద్దులలో ఈ నూతన సామాజిక వ్యవస్థయొక్క అధిక్యతను నిరూపించారు. అభివృద్ధి చెందిన అగ్రశేణి పెట్టుబడిదారీ దేశాలు ఈ రంగంలో, శ్రామిక ఉత్పాదకశక్తి విషయంలో మనకంటే ఎన్నో సంవత్సరాలు ముందుండేవి. కార్మికవర్గం, సమిష్టి వ్యవసాయక్షేత్ర రైతాంగం, మేధావులు, సోషలిస్టు కుటుంబానికి చెందిన వివిధ దేశాల ప్రజలు—వీరి స్వార్థరహిత కృషివల్ల పై జెప్పిన పెట్టుబడిదారీ దేశాలను ఆ రంగంలో అధిగమించటం సాధ్యం అయింది.

నూతన సమాజానికి చెందిన శ్రామిక ప్రజల సాంస్కృతిక-సాంకేతిక స్థాయిలు, క్రమశిక్షణ, నిర్మాణం, సృజనాత్మక అవకాశాలు, దృఢదీక్ష, రాజకీయ గుణగణాలు పరీక్షకు గురి అవుతున్నది సరిగ్గా, ఈ రంగంలోనే.

"శ్రమను గురించి, సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్కుల సమాఖ్యయొక్క, యూనియన్ రిపబ్లిక్కుల యొక్క మూలశాసనా"న్ని సోవియట్ యూనియన్ సుప్రీం సోవియట్ ఈ మధ్యనే ఆమోదించింది. అందులో యిలా వుంది: "ప్రజలు ఉత్పత్తిలో నానాటికి మరింత చక్కటి ఫలితాలు సాధించేందుకు, సోషలిస్టు సమాజ వ్యవస్థ భౌతిక, నైతిక

ప్రోత్సాహకాలను సమకూర్చుతుంది. సోవియట్ ప్రజల జీవన, సాంస్కృతిక ప్రమాణాలు స్థిరంగా మెరుగయేందుకు, సోషలిస్టు ఉత్పత్తి పెరుగుదల తోడ్పడుతుంది."

I

మార్క్సిస్టు-లెనినిస్టు పార్టీల నాయకత్వాన సాగిన కార్మికవర్గ విప్లవ పోరాటం ఆదినుంచి, పెట్టుబడిదారీ వర్గ పీడననుంచి శ్రమను విముక్తి చేయాలనే నినాదంతోనే సాగుతూ వుంది. సోవియట్ ప్రజలూ, యితర సోషలిస్టు దేశాల ప్రజలూ నేడు ఈ పోరాట ఫలితాలను సమీక్షించుకుంటున్నారు. ప్రపంచంలోని ఒక భాగంలో శ్రమను విప్లవాత్మకంగా విముక్తి చేయటం జరిగింది; ఫలితంగా, పెట్టుబడిదారీ విధానంలో శ్రమ ప్రత్యేక లక్షణమైన బానిస స్వభావం ఈ దేశాలలో లేకుండా పోయింది. దోపిడీ నుంచి విముక్తమై, మొత్తం సమాజం మేలు కోసమూ, ప్రత్యేకంగా, ప్రతి ఒక వ్యక్తి మేలు కోసమూ, శ్రామిక ప్రజలు సాగించే స్వచ్ఛంద కృషి సర్వసాధారణ లక్షణాలు దానికి అలవడ్డాయి. చారిత్రకంగా ఒక కొత్త రకానికి చెందిన శ్రామిక కార్యకలాపాలు ఆవిర్భవించాయి. అది కమ్యూనిజం ప్రథమ దశలోని పరిస్థితులకు అనుగుణమైన సోషలిస్టు శ్రమ.

శ్రమ స్వభావంలో వచ్చిన ఈ బ్రహ్మాండమయిన పరివర్తన సారాంశం యిదీ: సోషలిస్టు పద్ధతిలో ఉత్పత్తి సాధనాల సామాజికీకరణ మూలంగా, మనిషిని మనిషి దోచుకొనేందుకూ, దోపిడీ శక్తులు తిరిగి తలెత్తేందుకూ అవకాశం లేకుండా పోయింది; అదే సమయంలో విశాల శ్రామిక ప్రజలు ఉత్పత్తి సాధనాలకు యజమానులయారు; వారు శ్రమ ఫలితాల సృష్టికర్తలూ, వాటి సొంతదారులూ, వినిమయదారులూ కూడా.

శ్రమ చేసేవారే ఈ భూమికీ, దానిలోని అనంత సంపదకూ హక్కుదారులనీ, ఇతరులు సృష్టించిన సంపదను సొంతం చేసుకొనే పరశ్రమోపజీవులకు, సోమరి పోతులకు భూమిపై ఎలాటి హక్కూ లేదనీ కార్మికవర్గ అంతర్జాతీయ గేయం చెబుతోంది. సోషలిజం అమలు పరుస్తున్నది సరిగ్గా, శ్రామిక ప్రజలు కష్టపడి ఉత్పత్తి చేసిన సామాజిక సంపదపై వారికి గల ఈ హక్కునే. కార్మికుణ్ణి లాభాలు ఆర్జించిపెట్టే సాధనంగా పరిగణించే ఉపయోగవాద దృష్టి దోపిడీ సమాజాలకు సర్వసాధారణం. ఇది నిర్మూలించబడుతూ వుంది. శ్రామిక ప్రజల అవసరాలు నానాటికీ పెరుగుతున్నవి; వాటిని అధికాధికంగా, పూర్తిగా తీర్చటం సోషలిస్టు ఉత్పత్తి యొక్క లక్ష్యం అవుతున్నది. సామాజిక శ్రమ వ్యవస్థీకరణలో ప్రధానంగా నూతనమైన ఒక కొత్త రూపం తలెత్తుతున్నది. లెనిన్ చెప్పినట్లు, ఈ వ్యవస్థీకరణ, "శ్రామిక ప్రజల స్వచ్ఛందమైన, చైతన్యయుతమైన క్రమశిక్షణ పైననే ఆధారపడుతుంది. కాలం గడిచే కొద్దీ యిలా ఆధారపడటం హెచ్చుతుంది."

శ్రమను దేశవ్యాప్త స్థాయిలో ప్రణాళికాబద్ధంగా, శాస్త్రీయంగా వ్యవస్థీకరించేందుకు, దానిని సోషలిస్టు ఆస్తి ప్రాతిపదికపై ఆర్థికంగా సమైక్య పరచటం భౌతికంగా అవసరం. ఈ ఏకీకరణ ఆ శ్రమకు ప్రత్యక్ష సామాజిక స్వభావాన్ని అధికాధికంగా అలవరచుతుంది.

సోషలిజంలో ఒక కార్మికుడు సమాజానికి ఉప యోగకరమైన ఏ రకం శ్రమ చేస్తున్నాడనే విషయంతో, ఎలాంటి సాంకేతిక సాధనాలను (అవి ఆధునికమయిన స్వయంచాలన సాధనాలు కావచ్చు, లేదా మామూలు పరికరాలు కావచ్చు) ఉపయోగిస్తున్నాడనే విషయంతో నిమిత్తం లేకుండా, అతడి పని డొంక తిరుగుడుగా కాక, సూటిగా సోషలిస్టు సమిష్టి సంస్థ పనితో విలీన మవుతుంది. ప్రాథమిక మార్కెట్ అంచనాల అవసరం లేకుండానే, ఆ సంస్థ ఆ పనిని గుర్తిస్తుంది.

సోషలిజంలో శ్రమ శక్తి అనేది అమ్మే, కొనే వస్తువుగా వుండదు. శ్రామికునికి ఉపాధి లభించటం, ప్రయివేటు యజమానికి అతడి శ్రమశక్తి అవసరం వుందా లేదా అనే దానిపై యిక నేమాత్రం ఆధారపడదు. కార్మికులు దోపిడీ దారులపై ఆధారపడే స్థితికి బదులు పౌరులందరికీ పని చేసుకునే హక్కు ఏర్పడింది. రాజ్యాంగ వ్యవస్థ చట్టాలు ఈ హక్కును గ్యారంటీ చేస్తున్నవి. సమాజ ఆర్థిక రంగం యొక్క సోషలిస్టు వ్యవస్థీకరణ, సమాజంలోని ఉత్పత్తి శక్తులు స్థిరంగా పెరుగుతుండటం, ఆర్థిక సంక్షోభాలు వచ్చే అవకాశాలు తొలగిపోవటం, నిరుద్యోగం నిర్మూలించబడటం ఈ హక్కుకు హామీ నిస్తున్నవి. తన సామర్థ్యానికి, అర్హతకు, కృషికి తగిన ఉద్యోగం సంపాదించుకోవటం ద్వారా పని చేసుకొనేందుకు తనకు గల హక్కును అతడు అమలు పరచుకుంటున్నాడు. అతడి అర్హతలు, కృషి, శ్రమ ఫలితాల రూపం ధరిస్తాయి. పౌరులకు పని చేసుకునేందుకు గల హక్కు, శ్రద్ధతో పని చేయటం, క్రమశిక్షణకు బద్ధులవటం, పౌర ఆస్తిని కాపాడటం, ట్రేడ్‌యూనియన్ సహకారంతో ప్రభుత్వం ఏర్పరచిన పని పరిమాణాలను పూర్తి చేయటం అనే బాధ్యతలతో అంగాంగికంగా ముడిపడి వుంది.

పని చేసే హక్కు, పని చేయవలసిన యావన్మంది బాధ్యత—ఈ రెంటియొక్క అంగాంగిక సమ్మేళన సోషలిస్టు సమాజ ప్రధాన సూత్రం. ఈ సూత్రాన్ని నిర్బంధ చర్యలతో సహా తనకున్న అన్ని సాధనాలతో అమలు జరిపించేందుకు ఈ సమాజానికి హక్కుంది. పని ఎగవేయడం, ఆశ్రిత జీవనం, పరశ్రమోప జీవనం సోషలిస్టు న్యాయసూత్రాలకూ, సోషలిస్టు నీతి సూత్రాలకూ పూర్తిగా విరుద్ధమైనవి. ప్రజలు బూర్జువా నీతికి తిరిగి వెళ్ళకుండా క్రమ పద్ధతిలో పోరాడటం మొత్తం ప్రజలయొక్క, ప్రతి వ్యక్తియొక్క ప్రయోజనాలకు అనుగుణమైనది.

సోషలిజం, "శక్తినిబట్టి పనీ, పనిని బట్టి ప్రతిఫలం" అన్న సూత్రాన్ని అమలు జరుపుతోంది. ఇందువల్ల, సోషలిజంలో వినిమయం, పెట్టుబడిదారీ విధానంలో లాగా శ్రమశక్తి యొక్క విలువను బట్టి జరగదు; సమిష్టి కృషిలో ప్రతి వ్యక్తియొక్క వాస్తవ కృషి వంతును బట్టి జరుగుతుంది. రేపు మనకెంత వుంటుందనేది నేడు మనం చేసే పనిపై ఆధారపడి వుంటుంది. అయితే, పనిని బట్టి వినిమయం జరుగుతున్నంత మాత్రాన, ఒక వ్యక్తి ఆర్థిక పరిస్థితి పూర్తిగా అతనికి వచ్చే వేతనాన్ని బట్టి వుంటుందని అర్థం చేసుకోరాదు. ఆరోగ్య సంరక్షణ, విద్య, సాంస్కృతిక రంగం సాధించిన వాటి అనుభూతి

మొదలగు ప్రధానావసరాలన్నీ సోషలిజంలో ఉచితంగా తీరుతాయి. ఇందుకయ్యే ఖర్చులు ప్రభుత్వమో, లేదా ప్రజా సంస్థలో, లేదా ఈ రెండూనో భరిస్తాయి. ఇందులోనే మనకు భావి కమ్యూనిస్టు సమానతా బీజాలు, అంటే, సమాజంలోని యావన్మందీ అభివృద్ధి చెంద డానికి సమానావకాశాల బీజాలు కనిపి స్తున్నాయి.

ఆర్థికంగా అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలలో, నైపుణ్యంకల కార్మిక దళాయి కొన్ని, కొంతవరకు ఎక్కువ వేతనాలు సంపాదిస్తున్న మాట నిజమే. ఈ విషయాన్ని పెట్టుబడిదారీ విధానం సాక్షాత్తు "పునరుజ్జీవమే" పొందిందనేందుకు చిహ్నంగానూ, పెట్టుబడి దారులకూ, కార్మికులకూ మధ్య ఆహ్లాదకర మైన సహకారం నెలకొన్న "సర్వజన సౌభాగ్య" వ్యవస్థగా పెట్టుబడిదారీ విధానం పరివర్తన చెందినట్లుగానూ బూర్జువా ప్రచార కులు చిత్రిస్తుంటారు. కాని, వాస్తవానికి యుద్ధానంతర కాలంలో కార్మికవర్గంలోని ఒక భాగం యొక్క జీవన ప్రమాణం పెరగడానికి గల కారణాలు పెట్టుబడిదారీ విధానానికి ప్రతిష్ఠ తెచ్చిపెట్టేవి కావు.

ఈ కారణాలలో మొదట పేర్కొనవల సింది శాస్త్రీయ-సాంకేతిక ప్రగతి ఫలితంగా శ్రామిక ఉత్పాదక శక్తిలోనూ, తత్పర్యవ సానంగా బడా కంపెనీల లాభాలలోనూ వచ్చిన గణనీయమైన పెరుగుదల. గుత్తపెట్టుబడిదారీ వర్గం సామాజిక పన్నాగాలకు పూనుకొనే అవకాశాలు తాత్కాలికంగా విస్తరించడానికి తోడ్పడిన అంశ మిదే. ప్రపంచ సోషలిజం చూపుతున్న ఆదర్శం, శ్రామిక ప్రజలు తమ హక్కులకై సాగించే పోరాటాల ఉధృతి పెరుగుదల—వీటి ప్రభావం మూలంగా, గుత్తపెట్టుబడిదారీ వర్గం ఇటువంటి పన్నాగా లకు అంతకంతకు ఎక్కువగా పూనుకోక తప్పడం లేదు. మొత్తంపై కార్మికుల దారిద్ర్యం, పెరుగుతూవుందనే అభిప్రాయాన్ని ఖండిస్తూ, కార్మికుల సంఘటనా, నిరంతరం పెరుగుతూ వున్న వారి ప్రతిఘటనా, వారు మరింత బీదవారు కాకుండా సాధ్యమయినంత మేరకు నిరోధిస్తాయని ఎంగెల్స్ చెప్పారు; అయితే, జీవితానికి భద్రత లేకపోవడ మనేది మాత్రం ఖచ్చితంగా పెరుగుతూందని ఆయన నొక్కి చెప్పారు. జీవితానుభవం ఎంగెల్స్ అభిప్రాయాలు సరియైనవని ధ్రువపరచాయి.

కూలికి పనిచేసే కార్మికుడు, సోషలిస్టు సమాజంలో లాగాకాక, తన శ్రమ శక్తిని అమ్ముకొంటాడు. కాబట్టి, అతని వినిమయ పరిమాణ సూచీసంఖ్యలు ఏమైనప్పటికీ, తనకు భద్రతలేదని ఎప్పుడూ భయపడిపోతుంటాడు. అతడు ఉత్పత్తి సాధనాలనుంచి వేరు చేయ బడ్డాడు. కాబట్టి, ఎల్లప్పుడూ పెట్టుబడిదారీ మార్కెట్ శక్తుల చేతి కీలుబొమ్మగా వుంటాడు. మార్క్స్ మాటల్లో "అతని దారిద్ర్యం నాగరికత రంగు పులుముకొం టుంది;" అయినప్పటికీ, అతని శ్రమ మరొకరి సొత్తు. నేడు పెట్టుబడిదారీ ప్రపంచంలో ఈ విషయమై భ్రమలుండే వారి సంఖ్య క్రమ క్రమంగా తగ్గిపోతోంది. సోషలిస్టు దేశాలలో శ్రమకు సంబంధించిన సమస్యలను పరిష్క రించే పద్ధతి, యావత్తు ప్రగతిశీల మానవాళి దృష్టినీ ఆకర్షించింది.

II

సోవియట్ ప్రజలు సాధించిన బ్రహ్మాండమైన విజయాలు—చారిత్రకంగా స్వల్ప వ్యవధిలోనే దేశ పారిశ్రామిక శక్తినీ, రక్షణ పాటవాన్నీ సుస్థిరంగా నెలకొల్పడం, ప్రజల ఆస్తి ప్రాతిపదికపైనా, సమిష్టితత్వ సూత్రాల ప్రాతిపదికపైనా, పారిశ్రామిక, వ్యవసాయ రంగాలనూ, సంస్కృతినీ, జీవిత విధానాన్నీ, పూర్తిగా మార్చివేయడం, కోటానుకోట్ల ప్రజల సామాజిక చైతన్యాన్నీ, నైతికదృష్టినీ విప్లవమార్గంలో సరికొత్తగా తీర్చిదిద్దడం—ఇవన్నీ, సోషలిజం చేత విముక్తి పొందిన మానవ శ్రమకు నిజంగా ఎంత అపారమైన శక్తిగలదో నిస్సందేహంగా నిరూపిస్తున్నాయి. అదే సమయంలో, శ్రమ కూడ మార్పు లేకుండా పూర్వంలాగానే వుండదు. అది క్రమక్రమంగా కొత్త లక్షణాలను సంతరించుకొంటుంది; సహజంగానే, కమ్యూనిస్టు శ్రమగా పర్యవసిస్తుంది.

లెనిన్ ఇలా రాశాడు: "పరిమితమైన, ఖచ్చితమైన అర్థంలో, కమ్యూనిస్టు శ్రమ అన్నది సమాజ శ్రేయస్సుకై ఉచితంగా చేసే శ్రమ; ఒక నిర్దిష్ట విధిగాకాక, కొన్ని వస్తువులు పొందడానికి హక్కును సంపాదించే ఉద్దేశంతో కాక, అదివరకే రూఢమై, చట్టరీత్యా నిర్ణీతమైన పరిమాణాలను బట్టి కాక, ఐచ్ఛికంగా, ఈ పరిమాణాలతో నిమిత్తం లేకుండా చేసే శ్రమ; అది, ప్రతిఫలం ఆశించని, ప్రతిఫలం ఇవ్వాలనే షరతు పెట్టని శ్రమ; ఉమ్మడి మేలుకోసం పని చేయడం ఒక అలవాటయినందువల్ల, ఉమ్మడి మేలుకోసం పని చేయవలసిన ఆవశ్యకతను చైతన్యంతో గుర్తిస్తున్నందువల్ల (అదొక అలవాటయింది) చేసే శ్రమ—ఆరోగ్యవంతమైన జీవియొక్క అవసరంగా చేసే శ్రమ" (లెనిన్, కలెక్టెడ్ వర్క్స్, సం. 30, పుట 517).

శ్రమను, కమ్యూనిస్టు శ్రమగా (ఆ మాటకు గల ఖచ్చితమైన అర్థంలో) మార్చాలంటే, శ్రామిక కార్యకలాపాల సాంకేతిక ప్రాతిపదికలో గుణాత్మకమైన మార్పు తీసుక రావడం అవసరం. శాస్త్రీయ సాంకేతిక ప్రగతివేగాన్ని పెంచడం, కష్టమైన శారీరక శ్రమతో కూడుకొని వున్న వృత్తులనూ, విసుగు పుట్టించే శారీరక, మేధోశ్రమనూ క్రమక్రమంగా తొలగించడానికి పాదార్థిక పరిస్థితులను నెలకొల్పడం, సామాజిక ఉత్పత్తిరంగ మేనేజిమెంటులో, సమస్త పారిశ్రామిక కార్మికులూ, సమస్త వృత్తులవారూ, ఆఫీసు పనివారూ చురుకుగా పాల్గొనడం—వీటిపై ఈ పరివర్తన ఆధారపడివుంది.వ్యవసాయ రంగంలో శ్రమ, ఒక రకమైన పారిశ్రామిక శ్రమగా క్రమంగా మారడం, ఉన్నతమైన నైపుణ్యం కల కార్మికదళాలు, సాంకేతిక-ఇంజనీరింగ్ పనులు నిర్వహించే మేధావులతో విలీనం కావడం, పరిశ్రమల్లో, వృత్తులలో, ఆఫీసుల్లో పనిచేసే వారి సాంకేతిక-సాంస్కృతిక ప్రమాణాలు క్రమంగా అదే ఉన్నత స్థాయికి పెరగడం, నేడు సాగుతున్న కొన్ని తదితర క్రమాలు—ఇవన్నీ, ఇప్పటికే సోషలిస్టు శ్రమ కమ్యూనిస్టు శ్రమగా వృద్ధి చెందుతోందనీ, అందులో, శారీరక శ్రమా, మేధోశ్రమా సమరసంగా ఒకటైపోగల వనీ రుజువు చేస్తున్నాయి.

ఈ సందర్భంలో, శ్రమపట్ల, ప్రజల

ఆస్తిపట్ల కమ్యూనిస్టు వైఖరిని పాదుకొల్పే సమస్యకు అంతకంతకు ప్రాధాన్యం హెచ్చుతోంది. "ఉన్నతమైన రాజకీయ చైతన్యమూ, శ్రమపట్ల కమ్యూనిస్టు వైఖరీ అలవడేలా శ్రామిక ప్రజలకు శిక్షణ ఇచ్చే విషయానికి సైద్ధాంతిక కృషిలో సర్వప్రాధాన్య మివ్వాల"ని సోవియట్ కమ్యూనిస్టు పార్టీ 23 వ మహాసభ నొక్కి చెప్పింది.

శ్రమపట్ల వైఖరి, సామాజిక చైతన్యానికి సంబంధించిన పరిణామం, చైతన్యం, కేవలం జీవిత పరిస్థితుల ప్రతిబింబమే కాదు; దానికి కొంతవరకు స్వతంత్ర ప్రతిపత్తి కూడ వుంది. శాస్త్రీయ మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంత పరిజ్ఞానం అలవడితే, అది కమ్యూనిస్టు శ్రమలోని వివిధ అంశాల అభివృద్ధికి గొప్ప మూల కారణం కాగలదు. ఇది, పరిశ్రమలు మొదలయిన వాటిలోని సమిష్టి సంస్థలలో పనిచేసే పార్టీ శాఖల ప్రభావంపైనా, ప్రజలను సంఘటితపరచి, నడిపించేందుకు కమ్యూనిస్టులకుగల శక్తిపైనా ఎక్కువగా ఆధారపడి వుంటుంది.

శ్రమపట్ల కమ్యూనిస్టు వైఖరి అన్నది, ఈ నాడు సామూహిక సోషలిస్టు పోటీ ఉద్యమ నినాదంగా మారింది. ఉత్పత్తి రంగంలో గరిష్ఠ పని ప్రమాణాన్ని సాధించేందుకు నిరంతరం కృషి చేయడం, కమ్యూనిస్టు శ్రమకు, ఆ పదంయొక్క పరిమితమైన, ఖచ్చితమైన అర్థంలో, క్రమ క్రమంగా మారడానికి అనుకూల పరిస్థితులను ఏర్పరచడం, వ్యక్తి సర్వతోముఖాభివృద్ధికి దోహదం చేయడం—ఇవన్నీ శ్రమపట్ల కమ్యూనిస్టు వైఖరికై జరిగే పోరాటంలో గర్భితమై వున్నాయి. కమ్యూనిస్టు శ్రమకోసం జరిగే పోటీ ఉద్యమం, ఈనాటి ప్రగతిశీల ఉద్యమాల్లో ఒకటి. ఈ ఉద్యమ ప్రతి దశలోనూ, దాన్ని పరిశీలించి చూడాలి, నడపాలి; నిర్దుష్టం చేయాలి; దానికి కొత్త పుష్టిని చేకూర్చాలి.

కమ్యూనిస్టు శ్రమ, సహజంగా సోషలిస్టు శ్రమనుంచీనే రూపొందుతుంది.

సోవియట్ కమ్యూనిస్టు పార్టీ 24 వ మహాసభను జాతీయ ఆర్థిక వ్యవస్థలో మహత్తర విజయాలు సాధించే సమయంగా చేయడానికై దేశవ్యాప్త ఉద్యమం సాగుతోంది. మన దేశంలోని సోషలిస్టు పోటీ ఉద్యమ పరిణామంలోని అత్యుత్తమమైన, అత్యంతోపయోగకరమైన లక్షణాలు ఈ ఉద్యమంలో ఇమిడి వున్నాయి. పరిశ్రమల్లో, వృత్తులలో, కార్యాలయాల్లో పని చేసే కార్మికులూ, సమిష్టి వ్యవసాయదారులూ శాస్త్రీయ, సాంకేతిక ప్రగతికి సంబంధించిన ప్రధాన రంగాలపై కేంద్రీకరించి పని చేస్తున్నారు; సామాజిక శ్రమ వ్యవస్థీకరణ యొక్క శాస్త్రీయ స్థాయిని పెంచడానికై పని చేస్తున్నారు. ఇదంతా, కమ్యూనిస్టు నిర్మాణ ప్రస్తుత దశలో మన సమాజంయొక్క సామాజిక-ఆర్థిక, సాంస్కృతిక అభివృద్ధి అవసరాలకు పూర్తిగా అనుగుణంగా వుంది.

III

శ్రమపట్ల, శ్రామిక శిక్షణపట్ల సూత్రబద్ధమైన మార్క్సిస్టు-లెనినిస్టు విధానాన్ని అనుసరిస్తూన్న కమ్యూనిస్టు పార్టీ, ముందుగానే నిర్ణయించుకున్న రూపాలను నిరాకరిస్తూంది. వాస్తవ పరిస్థితులపై, ఈనాడున్న పరిస్థితిపై, భవిష్యత్తును గురించిన శాస్త్రీయ వివేచనపై ఆధారపడుతూంది.

శ్రమపట్ల కొత్త వైఖరిని అలవరచడాన్ని, ప్రజల సంక్షేమాభివృద్ధితో మేళవించడం రివిజనిస్టులకు చేతకాదన్న విషయం అందరికీ తెలిసినదే. అందుచేత వారు, ఈ రెండిటికీ "సంఘర్షణ" ఉందని ఊహిస్తారు.

ఉదాహరణకు, సోషలిస్టు వ్యవస్థలో ఆర్థికాభివృద్ధి అంతా, మానవుడినీ, అతని అవసరాలను తీర్చడాన్నీ, దృష్టిలో పెట్టుకునే సాగుతున్నదన్న విషయాన్ని దాటవేయటం "అతివాదుల"కు సహజం. పాదార్థిక ప్రోత్సాహకాలను "నూటికి నూరువంతులు బూర్జువా ఆర్థికవాద"మని వారు తెగనాడుతున్నారు. "అహంకార" వ్యతిరేక పోరాటమనే కపట నినాదం చాటున "అందరికీ సమానంగా దారిద్ర్యం పంపకం" అని చెప్పదగిన దానిని ప్రతిపాదిస్తున్నారు; సోషలిస్టు వ్యవస్థకు విరుద్ధమైన బారకాసు తరహా నిర్మాణంపట్లా, మిఠాయి దుకాణం పద్ధతిలో ఉత్పత్తిపట్లా నమ్మకం చూపుతున్నారు.

ఇటు మితవాద రివిజనిస్టులు బూర్జువావర్గ ప్రత్యక్ష తాబేదారులుగా ముందుకు వస్తున్నారు; శ్రామిక ప్రజల్లో వ్యక్తిగత ఆస్తి భావాలనూ, బలవంతంగా దోచుకొనే భావాలనూ రేకెత్తించడంపై పీసు ఆశలు పెట్టుకుంటున్నారు. ఉత్పత్తి, వినిమయాల విషయంలో సోషలిజానికి విరుద్ధమైన సూత్రాలను బలపరుస్తున్నారు. వాస్తవానికి, బూర్జువా వ్యవస్థను పునరుద్ధరించే దిశగా పయనిస్తున్నారు.

శ్రమకు సంబంధించిన సమస్యలపట్ల ఈ రివిజనిస్టు వైఖరులు రెండూ కూడా, సోషలిస్టు జీవన విధానానికి పొసగనివి. సామాజిక శాస్త్ర పరిశోధనలు, మానవ సంబంధమైన పత్రాలు, పార్టీకి, సోవియట్ ప్రభుత్వ సంస్థలకు, పత్రికల, రేడియో, టెలివిజన్ సంపాదక వర్గాలకు మన శ్రామిక ప్రజలు రాసే లేఖలు—ఇవన్నీ కూడా ఈ విషయానికి పుష్కలమైన, తిరుగులేని రుజువులు.

"ప్రజల్లో ఏ లక్షణానికి మీరు అన్నిటికన్నా ఎక్కువ విలువ ఇస్తారు?" అన్న ప్రశ్నకు, "పనిని ప్రేమించడానికి" అని ఒకటవ నంబరు ప్రభుత్వ బాల్ బేరింగ్ ఫ్యాక్టరీ కార్మికుల్లో 90 శాతం జవాబు చెప్పారు; "మీకు అన్నిటికన్నా ఎక్కువ ఆనందాన్ని చేకూర్చేది ఏది?" అన్న ప్రశ్నకు, సోవియట్ ప్రజల సృజనాత్మక శ్రమా, శ్రామిక విజయాలూ అని, 78 శాతం మంది జవాబిచ్చారు. సోవియట్ సమాజంలో సర్వత్రా వ్యక్తమవుతూన్న అభిప్రాయం ఇది.

శ్రమపట్ల తమ వైఖరిని నిర్ణయిస్తున్నది కేవలం తమ వేతనాలు ఒక్కటే కాదని, ఐదు మాస్కో ఫ్యాక్టరీల్లోని సమిష్టి సంస్థలకు చెందిన 1500 మంది కార్మికులు, ఫోర్మన్లు ధ్రువ పరిచారు. ఈ ఐదు ఫ్యాక్టరీల్లోని కార్మికులు, సత్ఫలితాలకు కారణభూతమైన వాటిలో వేతనాలకు నాల్గవ, ఐదవ, లేదా ఆరవ స్థానాన్నీ, చెడు ఫలితాలకు, కారణభూతమైన వాటిలో తక్కువ వేతనాలకు మూడవ, లేక నాల్గవ స్థానాన్నీ ఇస్తున్నారు. తమ సోదర కార్మికులతో సత్సంబంధాలు, చక్కని సమిష్టి కృషి, అనుకూలమైన షిఫ్టుల ఏర్పాటు, చొరవా, చాకచక్యమూ అవసరమయే బహువిధమైన పనులు, తాము ఉత్పత్తిచేసే వాటికి జాతీయ ఆర్థికరంగంలో ఉన్న ప్రాధాన్యము—వీటికి

చాలా ఉన్నత స్థానమిస్తున్నారు. పని పంపకంలో హెచ్చు తగ్గులు, ఉత్పత్తికి ఒక క్రమమైన తీరు లేకపోవడం, లోపభూయిష్టమైన శ్రమ వ్యవస్థీకరణ, భద్రత ఏర్పాటుల్లో లోపాలు, కష్టతరమైన శారీరక శ్రమ, మానవ అవసరాల పట్ల మేనేజిమెంటు శ్రద్ధ వహించక పోవడం—కార్మికుల్లో అసంతృప్తిని కలిగించే చెడు అంశాలలో ఇవి ప్రధానమైనవి.

శాస్త్రీయ, సాంకేతిక ప్రగతి మరింత వేగం కావడం, సోషలిస్టు ఉత్పత్తి రంగంలో సాంస్కృతికంగా, సాంకేతికంగా, వృత్తి రీత్యా కార్మికులకు అవసరమయే ప్రమాణాలు పెరిగిన ఫలితంగా పనిపట్ల వైఖరి మారింది. తమ కార్యకలాపాల అంతస్సారం పట్ల కార్మికులు అధికాధిక శ్రద్ధ కనబరుస్తున్నారు. కేవలం మంచి వేతనాలు లభించే ఉద్యోగాలను కోరేవారికన్నా, తాము చేస్తూన్న వాటికన్నా మరింత ఉత్సాహకరమైన ఉద్యోగాలకు బదిలీ కావాలని కోరేవారి సంఖ్య రెండున్నర రెట్లు అధికమని, అభిప్రాయ సేకరణ ఫలితాలు వెల్లడి చేస్తున్నాయి. పని పరిస్థితులనూ, పని వ్యవస్థీకరణనూ మరింత మెరుగు పరిచేందుకు నలభై శాతం కార్మికులు వివిధ ప్రతిపాదనలు చేశారు. శ్రమ ఫలదాయకతను పెంచడానికీ, కొత్త పుంతలు తొక్కేందుకూ కృషిచేస్తూన్న వారి ఉద్యమంలో, ప్రతి ఏడుగురు కార్మికులకూ ఒకరు చొప్పున పాల్గొంటున్నారు. శ్రామిక ప్రజల సృజనశీల ఆసక్తుల పాత్రా, ఉత్పత్తిరంగ కార్యకలాపాలు వీరి ప్రభావం వల్ల ముమ్మరం కావడంవల్ల చేకూరుతున్న ఫలితాలూ పెరగడం, ఇటువంటి కార్యకలాపాలను స్పష్టంగా విశదం చేస్తున్నాయి.

ప్రతి ఒక్క వ్యక్తి యొక్క భౌతిక, ఆత్మిక అవసరాలను, అతని పని పరిమాణానికీ, స్వభావానికీ అనుగుణంగా, పూర్తిగా తీర్చడం అనేది, మన సమాజం శ్రద్ధ వహిస్తూన్న ప్రధాన విషయాల్లో ఒకటి. అయితే, సోషలిస్టు శ్రమకు కేవలం పాదార్థిక ప్రోత్సాహకాలు ఉండడం మాత్రమే ఇందుకు చాలదు.

మన దేశంలో, పని కేవలం జీవనోపాధి మాత్రమే కాదు. అది సోవియట్ ప్రజలకు ఒక ఆత్మిక అవసరంగానూ, సమాజంపట్ల వారి ఉదాత్తమైన ధర్మంగానూ పరిణమించింది. పాదార్థిక ప్రోత్సాహకాలు, నైతిక ప్రోత్సాహకాలను పటిష్ఠం చేయడంలో పెద్ద పాత్రను నిర్వహిస్తున్నాయి.

సోషలిస్టు శ్రమ నేడు, ఆర్థిక సంస్కరణలు అమలు జరిగిన పరిస్థితుల్లో అభివృద్ధి చెందుతూంది. అధికతర శాస్త్రీయ, సాంకేతిక ప్రగతిని సాధించడం, ఆర్థిక పద్ధతుల ద్వారా ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచడం ఈ సంస్కరణల లక్ష్యం. అయితే, ఆర్థిక సాధనాలు ఏకైక సాధనాలని గాని, అవే నిర్ణయాత్మకమైనవని గాని దీని అర్థంకాదు. ఆర్థిక పద్ధతుల స్థానంలో యితర పద్ధతులను ప్రవేశపెట్టాలన్నది కాదు సమస్య. అత్యుత్తమ ఫలితాలను చేకూర్చగల రంగాలన్నిటిలోనూ ఈ ఆర్థిక పద్ధతులను విస్తృత స్థాయిలో ఉపయోగించడం అన్నదే సమస్య. మూలసారంలో ఈ సంస్కరణ, సోషలిస్టు సంస్కరణ; అంటే అర్థం,సోవియట్ సంప్రదాయాలకు గాని, కార్మికుల నైతిక విలువలకూ

ప్రయోజనాలకు గాని, పనిపట్ల ప్రదర్శితం కానారంభించిన కమ్యూనిస్టు వైఖరికి గాని ఇది విరుద్ధం కాదన్నమాట.

వ్యక్తి యొక్క ఆత్మిక, సృజనాత్మక ప్రేరణలనూ, సామాజిక-సాంస్కృతిక అవసరాలనూ అశ్రద్ధ చేయడం జరిగినప్పుడు, క్రమశిక్షణ సడలిపోతుంది. ప్రజలపై వుంచే బాధ్యతలూ తగ్గిపోతాయి. ఇది, ఆర్థికరంగం పై దుష్ప్రభావాన్ని ప్రసరింపజేస్తుంది.

పౌర రంగంలో ఉత్సాహపూరితమైన కృషి, చురుకైన సృజనాత్మక అన్వేషణ, మనకు అతి అమూల్యమైన మూలబలాల్లో రెండు. ఇవి మన సామాజిక సంపద. వీటిని అత్యంత ఫలప్రదంగా వినియోగించుకోవాలి, సకల విధాలా పెంపొందించుకోవాలి.

ప్రణాళికాబద్ధమైన సోషలిస్టు సమాజంలో, పొదుపుకు ఆర్థిక ప్రాధాన్యమూ, నైతిక ప్రాధాన్యమూ కూడా ఉన్నాయి. శ్రమనూ, పాదార్థిక వనరులనూ పొదుపుగా ఉపయోగించడం అంటే, శ్రమ విలువను తెలుసుకోవడం అన్నమాట, అన్నిటినీ మానవ శ్రమ ఫలితాలుగా పరిగణించడం అన్నమాట, ఉమ్మడి ఆశయ సాధన కృషిలో భాగస్వామిగా వ్యవహరించడం అన్నమాట.

అత్యంత ఫలప్రదంగానూ, క్రమశిక్షణతోనూ సమాజ శ్రేయస్సుకై జరిగే కృషికి, సోషలిజం, సామాజిక విలువల్లో కెల్లా ప్రధాన స్థానం ఇస్తుంది; ఉత్తమ శ్రామికులకు దేశ వ్యాపిత ప్రఖ్యాతిని కలిగిస్తుంది. ఈ సూత్రాన్ని మన పార్టీ ఎల్లప్పుడూ కూడా అమలు జరుపుతూ వచ్చింది, ఇకముందూ అమలు జరుపుతూనే ఉంటుంది.

(ప్రావ్దా, 1970, సెప్టెంబరు 18)

సోవియట్-భారత సహకారం

జవాహర్లాల్ నెహ్రూ-సోవియట్ దేశానికి చిరస్మరణీయులైన మిత్రులు

ఎ. వాఫా

సోవియట్-భారత స్నేహానికి ప్రతీకలుగా వున్న వాటిలో జవాహర్లాల్ నెహ్రూ పేరు ఒక అత్యంత ప్రముఖ స్థానం అలంకరిస్తూ వుంది.

ఈ స్నేహాన్ని పటిష్ఠం చేయటంలో, పెంపొందించటంలో ఆయన నిర్వహించిన గొప్ప పాత్రను ఈ చిన్న వ్యాసంలో సాకల్యంగా వివరించటం అసాధ్యం. అందుకని, సోవియట్ యూనియన్ గురించి ఆయన వ్యక్తం చేసిన భావాలను మాత్రమే గుర్తు చేస్తాను; ఆయన జీవితంలో నుంచి ఆయన దృక్పథాన్ని వెల్లడించే కొన్ని ఘట్టాలను మీ దృష్టికి తెస్తాను.

సోవియట్ యూనియన్ సందర్శించిన నలుగురు భారతీయ యాత్రికులు

1927 నవంబరు 7 ....బెర్లిన్ రైలు పోలెండ్-రష్యా సరిహద్దులోని స్టేషనులో ఆగింది. ఇందులోని ప్రయాణీకుల్లో నలుగురు భారతీయు లున్నారు. వారు తమకు ప్రప్రథమంగా తటస్థపడిన సోవియట్ దేశీయుల ముఖాలను పరీక్షగా చూడసాగారు. ఎంతో వేడుకగా కన్పిస్తున్న రైలు స్టేషన్ వారి దృష్టిని బాగా ఆకట్టుకొంది. సుత్తి, కొడవలి చిహ్నాలుగల ఎర్ర జండాలు, అసంఖ్యాకంగా వున్న లెనిన్ చిత్రపటాలు.... ఇదంతా వారికి కొత్తగా, ప్రత్యేకంగా వుంది. ముక్తసరిగానే అయినా సోవియట్ ప్రజలతో వారి తొలి సంభాషణలు, వారిని గురించిన తొలి అనుభవాలు, పరిశీలనలు యిక్కడే ప్రారంభమయాయి.

"విదేశాలతో సాంస్కృతిక సంబంధాల సమితి" ప్రతినిధులు మాస్కోలో ఈ నలుగురు భారతీయులకు స్వాగత మిచ్చారు. మాస్కోలోని విప్లవ చౌకులో వున్న గ్రాండ్ హోటల్ కిటికీల్లో నుంచి ఈ

పిల్లలంటే ప్రాణంపెట్టే జవహర్లాల్ నెహ్రూ జన్మదినాన్ని, అందుకు తగినట్లుగానే, ప్రతిఏడాదీ బాలల దినోత్సవంగా జరుపుతున్నారు. →



అతిథులు శోభాయమానంగా వున్న నగరాన్ని చూచారు.

తమ తండ్రిగారయిన మోతీలాల్ నెహ్రూతోనూ, తమ సతీమణితోనూ, చెల్లెలితోనూ కలిసి, అక్టోబర్ సోషలిస్టు మహావిప్లవ దశమ వార్షికోత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన జవాహర్లాల్ నెహ్రూ తమకు కలిగిన తొలి అనుభూతిని జ్ఞాపకం చేసుకుంటూ, అక్కడకు ఒకటి రెండు రోజులు ముందే రాలేక పోయినందుకు విచారించానని రాశారు. ప్రధానమైన ఉత్సవం వారు రావడానికి ఒక రోజు ముందే జరిగింది. దాని నాయన చూడలేక పోయారు.

అప్పుడాయన మాస్కో నగరం మాత్రమే చూచారు. అందమైన, అపురూపమైన, ఆ విశాల నగరాన్ని చూడటం మాత్రమే గాక, ప్రజల జీవిత అంతస్సారాన్ని తెలుసుకునేందుకూ, అక్టోబర్ విప్లవానంతరం రష్యాలో వచ్చిన బ్రహ్మాండమయిన మార్పులను అర్థం చేసుకునేందుకూ గూడ ఆయన ప్రయత్నించారు.

చర్చిల ముందునుంచి వెళ్లుతూ మతంలో విశ్వాసం గలవారిని ఆయన చూచారు. ఆ తరువాత రాసినట్లు, ఆయన సోవియట్ యూనియన్‌లో మత సమస్యను,మతారాధన స్వేచ్ఛ, మత వ్యతిరేక ప్రచార సమస్యలను పరిష్కరించిన విధానాన్ని గురించి యోచించారు. ప్రజలు ఒకరి నొకరు "తొవరిష్" (కామ్రేడ్) అని పిలుచుకోవటం ఆయన విన్నారు. ఇది ఆయనకు కొత్త. ఒక వంక విలాసాలూ, మరోవంక పేదరికమూ, కులాల, వర్గాల అంతరువులూ లేకపోవటం గురించి ఆయన ఆలోచించారు. ఆయన దుకాణాలను, ఫ్యాక్టరీలను చూచి (వీటిలో ఎక్కువ భాగం ప్రభుత్వానివి; చాలా కొద్ది మాత్రమే ప్రయివేటు వ్యక్తులవి) ప్రభుత్వ, ప్రయివేటు ఆస్తులకు సంబంధించిన సమస్య గురించి ఆలోచించారు. ప్రజలు అందమైన దుస్తులు ధరించలేదు; కొన్ని సందర్భాల్లో అవి ఏమీ బాగా లేవు. వీరిని చూచి, ఒక నూతన సమాజాన్ని నిర్మించటంలో ఎదురయ్యే చిక్కుల గురించి ఆయన ఆలోచించారు. ఆయన బోల్షోయ్ థియేటర్‌కు వెళ్లారు. ఆయన అక్కడ గొప్ప సంగీత రూపక కళను మాత్రమేగాక, కొత్త శ్రోతలను గూడ చూచారు. ఆయన, "పెట్రోగ్రాడ్ తుది రోజులు" అన్న చలన చిత్రాన్ని చూచారు. ఈ చిత్రం అందాన్నీ, కళాత్మక ప్రమాణాల్నీ గమనించటం మాత్రమేగాక, విప్లవాత్మకమైన కళ ప్రజల మనస్సులపై ఎలాంటి శక్తివంతమయిన ప్రభావం కలిగిస్తుందో కూడా ఆయన యోచించారు. భారత దేశం అలాంటి చిత్రాలను చూచేందుకు నోచుకోకపోవటం యాదృచ్ఛిక మేమీ కాదని ఆయన ఆ తదుపరి రాశారు.

తొలి అనుభూతులు

నెహ్రూ, ఆయన కుటుంబ సభ్యులూ, "విప్లవ వస్తు ప్రదర్శనశాల"నూ, ఎర్ర చౌకునూ చూచారు. క్రెమ్లిన్‌లో వారు యం. ఐ. కాలినిన్‌ను కలుసుకున్నారు. రష్యా దేశ మిత్రుల సమావేశంలో వారు పాల్గొన్నారు. వారి ఈ పర్యటన కార్యక్రమం ఎంతో విస్తారమైనదీ, వైవిధ్యం కలదీ. నెహ్రూ అపోహలను గానీ, వ్యతిరేకతను గానీ చూపలేదు. ఆయన ప్రతి ఒక్క విషయాన్నీ, చింతకుని

దృష్టితో, శ్రేయోభిలాషి దృష్టితో చూచారు. ఎంతో ముఖ్యమైన సమస్యలకు సమాధానాల కోసం అన్వేషిస్తున్నటువంటి, గొప్ప ఆవేశంతో ఉద్దీప్తుడయి నటువంటి వ్యక్తి దృష్టి ఆయనది. తాను చూచిన వేరు వేరు విషయాలనూ, పొందిన అనుభూతులనూ బట్టి ఆయన గొప్ప సూత్రీకరణలు చేశారు.

ఆయన మాస్కోలో మూడు నాలుగు రోజులు మాత్రమే గడిపారు. "అయినా, అక్కడకు వెళ్ళినందుకు మేము సంతోషించాం. ఎందుకంటే ఇది స్వల్ప పరిచయమైనా, దీనివల్ల ప్రయోజనం సిద్ధించింది. ఈ యాత్ర ద్వారా, నవ రష్యా గురించి ఎక్కువగా తెలుసుకోలేదు, తెలుసుకోలేము కూడా. ఇది నిజమే, అయినప్పటికీ భవిష్యత్తులో పుస్తకాల ద్వారా ఆ దేశం గురించి తెలుసుకొనేందుకు అది మాకు ప్రాతిపదికను సమకూర్చింది" అని ఆయన ఆ తరవాత రాశారు.

తదుపరి సంవత్సరాలలో ఆయన తన అనేక ప్రసంగాల్లోనూ, రచనల్లోనూ, సోవియట్ యూనియన్ అనుభవాన్ని ప్రస్తావించారు. మొట్టమొదటి సోషలిస్టు దేశంలో జరిగిన గొప్ప పరివర్తనల చారిత్రక ప్రాముఖ్యాన్ని ఆయన ఆ ప్రసంగాల్లోనూ, రచనల్లోనూ అంచనా కట్టారు, వాటికి అర్థం చెప్పారు.

సోవియట్ యూనియన్ నుంచి తిరిగి వెళ్ళిన తరువాత "సోవియట్ రష్యా" అనే పేరిట ఆయన వ్యాసాల సంకలనం 1929లో భారత దేశంలో ప్రచురితమైంది. తన యితర అనేక రచనలతోబాటు, "ప్రపంచ చరిత్ర", "ఆత్మకథ", సుప్రసిద్ధమైన "భారత దర్శనం" అన్న గ్రంథాల్లో ఆయన సోవియట్ రష్యా గురించి విస్తారంగా రాశారు.

సోవియట్ యూనియన్ అనుభవం పట్ల నెహ్రూ ఆసక్తికి కారణమేమిటి? ఆ భారత మహాపుత్రుడు మన దేశంపట్ల అంత గొప్ప శ్రద్ధ ఎందుకు వహించినట్లు?

నెహ్రూ ఎందుకని ఆకర్షితులయారు

గొప్ప దేశభక్తుడయిన నెహ్రూ తమ దేశ పునరుజ్జీవనానికీ, అభివృద్ధికీగల కొత్త మార్గాల కోసం, వలస దాస్యంలో మగ్గుతూ, పీడనకు వ్యతిరేకంగా పోరాడుతున్నటువంటి తమ దేశ ప్రజల సామాజిక, ఆత్మిక ప్రగతి సాధించేందుకు నూతన మార్గాలకోసం తీవ్రంగా అన్వేషించారు. రష్యాలో వచ్చిన బ్రహ్మాండమయిన మార్పులు తమను సోవియట్ యూనియన్ వైపుకు గొప్పగా ఆకర్షించాయని ఆయన రాశారు. లెనిన్ దేశం యావత్ ప్రపంచానికీ ఆశాజ్యోతి కాగలదని ఆయన గుర్తించారు.

అక్టోబర్ విప్లవానంతరం రష్యాలో వచ్చిన మార్పుల గురించి మాత్రమేగాక, ఆ విప్లవానికి పూర్వం రష్యా స్థితిగతుల గురించి, ప్రత్యేకించి మన దేశ విప్లవోద్యమ చరిత్ర, సోవియట్ కమ్యూనిస్టు పార్టీ పోరాట చరిత్ర, రష్యాలో జరిగిన మూడు విప్లవాల అనుభవం, అక్టోబర్ సోషలిస్టు మహా విప్లవానికి ముందూ, విప్లవం రోజుల్లోనూ వుండిన పరిస్థితుల గురించి కూడా ఆయన ఆసక్తి చూపారు.

అక్టోబర్ సోషలిస్టు మహావిప్లవ ప్రాము

ఖ్యాన్ని అంచనావేస్తూ అది రష్యా రూపాన్ని మార్చివేసి, ఒక నూతన యుగానికి నాంది పలికిన గొప్ప విప్లవమనీ, అది నిస్సందేహంగా ప్రపంచ చరిత్రలోని మహత్తర ఘటనల్లో ఒకటనీ ఆయన రాశారు.

అక్టోబర్ విప్లవాన్ని ప్రపంచ చరిత్రలో యాదృచ్ఛికంగా సంభవించిన ఘటనగా ఆయన ఎంచలేదు. పైపెచ్చు ప్రపంచ పరిణామక్రమం యాచత్తూ, రష్యాలో జరిగిన ఆర్థిక, సామాజిక, రాజకీయ క్రమాలు అన్నీ ఆ విప్లవానికి సన్నాహాలు చేశాయని ఆయన సరిగానే తెలియజేశారు. నెహ్రూ అక్టోబర్ సోషలిస్టు మహా విప్లవాన్ని, శ్రామిక ప్రజల విప్లవంగా వారి ప్రయోజనాల కోసం జరిగిన విప్లవంగా పరిగణించారు.

1930 దశకం గడ్డు దినాల్లో, ఒక కొత్త యుద్ధ మేఘాలు ముసురుకుంటున్న పరిస్థితుల్లో ఆయన అక్టోబర్ విప్లవాన్ని గుర్తుచేస్తూ, శాంతి దాని నినాదమని 1933 లో రాశారు. యుద్ధంచేస్తున్న దేశాల కార్మిక కర్షకులు శాంతి కోసం కృషి చేయాలని, సోవియట్‌లూ, బోల్షెక్కులూ విజ్ఞప్తి చేశారు; అది పెట్టుబడిదారీ యుద్ధమనీ, సామ్రాజ్యవాదుల ఆశయ సిద్ధికోసం కార్మిక కర్షకులు తాము బలి పశువులు కారాదని తెలియజేశారని ఆయన రాశారు. నెహ్రూ సరిగానే చెప్పినట్లు, విప్లవ రష్యా విజ్ఞప్తికి చాలా దేశాల్లో ఆమోదం లభించింది.

అక్టోబర్ విప్లవం జాతుల మధ్య శాంతి కోసం విజ్ఞప్తి చేయటం ద్వారా విప్లవోద్యమాన్ని కూడా ప్రాభావితం చేసింది. ఇది యాదృచ్ఛికం ఏమీ కాదు.

లెనిన్‌పట్ల ప్రశంసా భావం

సోవియట్ కమ్యూనిస్టు పార్టీ, దాని నాయకుడైన వి. ఐ. లెనినూ నిర్వహించిన నాయకపాత్రకు జవాహర్లాల్ నెహ్రూ గొప్ప విలువ నిచ్చారు. ఆయన తమ గ్రంథాల్లో వి. ఐ. లెనిన్ గురించీ, ఆయన సిద్ధాంత రచనల గురించీ, ఆచరణ పూర్వక విప్లవ కార్యకలాపాల గురించీ విస్తారంగా రాశారు. లెనిన్ గురించి ఆయన చాలా ప్రశంసాభావంతో ముచ్చటించారు. మార్క్స్, లెనిన్‌ల రచనల అధ్యయనం తనపై గొప్ప ప్రభావం కలిగించిందనీ, చరిత్రనూ, వర్తమాన వ్యవహారాలనూ కొత్త దృష్టితో చూచేందుకు తోడ్పడిందనీ ఆయన తెలియజేశారు. లెనిన్ విప్లవ సిద్ధాంతాన్నీ, విప్లవ కార్యాచరణనూ జతపరచారు; శ్రామిక ప్రజలకు నాయకత్వం వహించారు. ఈ విషయం నెహ్రూను ప్రత్యేకించి ఆకర్షించింది.

ఆ రోజుల్లో రాజకీయ స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న భారతదేశం జాతీయ పునరుజ్జీవన, అభివృద్ధుల మూల సమస్యలను ఏ మార్గంలో పరిష్కరించుకోవలసి వుంటుందో నిర్ధారణ చేసేందుకు ప్రయత్నించిన నెహ్రూ రెండు మార్గాలను, అంటే పెట్టుబడిదారీ, సోషలిస్టు మార్గాలను పోల్చి చూడక తప్పలేదు. ఆ విధంగా పోల్చి చూచారు కూడా. మిగతా ప్రపంచ మంతా ఆర్థిక మాంద్యంలో చిక్కుకొని ఉక్కిరి బిక్కిరై పోతూండగా, కొన్ని విషయాల్లో తిరోగమిస్తూ కూడా వుండగా, సోవియట్ దేశంలో ఒక గొప్ప నవ ప్రపంచ నిర్మాణం జరుగుతూ

వుందని ఆయన తమ "ఆత్మకథ"లో రాశారు. మహదాత్ముడయిన లెనిన్ ఆదేశాలను శిర సావహిస్తూ, రష్యా భవిష్యత్తులోకి చూస్తోంది; ముందు జరగాల్సిన దాన్ని గురించి మాత్రమే ఆలోచిస్తోంది; ఇతర దేశాలేమో మృతప్రాయ మైన గతకాలపు విష కౌగిలిలో చిక్కుపడి, నిరుపయోగమయిన గత యుగ అవశేషాలను కాపాడేందుకోసమే తమ శక్తిని వృథా చేస్తున్నవి అని ఆయన అన్నారు.

రష్యా భవిష్యత్తులోకి చూస్తోంది—అక్టోబర్ విప్లవానంతరం రష్యాలో వచ్చిన పరివర్తనలను అంచనా వేయటంలో నెహ్రూ గీటురాయిగా పెట్టుకున్నది ఈ అంశాన్నే. పూర్వం వెనుకబడిన జారిస్టు రష్యా సరిహద్దు ప్రాంతాలు చారిత్రకంగా ఒక స్వల్ప వ్యవధి లోనే తమ వెనుకబాటుతనాన్ని వదిలించుకొని, సంపన్న ప్రాంతాలుగా అభివృద్ధిచెందటం ఆయన దృష్టిని ప్రత్యేకించి ఆకర్షించింది. ఆయనే చెప్పుకున్నట్లు ఈ విషయం ఆయనపై గట్టి ప్రభావం కలిగించింది. ఈ అపూర్వ ప్రగతి, సోవియట్ దేశ ప్రజలు చేపట్టిన పెట్టుబడిదారీ విధానేతర పంథా ఫలితమేనని ఆయన చక్కగా గుర్తించారు. దేశంలోని మరింత అభివృద్ధి చెందిన ప్రాంతాల కార్మికవర్గం మద్దతుతో సోవియట్ ప్రజలు ఈ పంథాను స్వీకరించారు. ప్రత్యేకించి, మధ్య ఆసియా లోని వెనుకబడిన ప్రాంతాల్లో వచ్చిన మార్పులను ఆయన చరిత్రాత్మకమైన దృష్టాంతంగా పరిగణించారు. ఈ మార్పులు భారతీయులలో ఆలోచనలను పురికొల్పాయి.

"ఆర్పివేయ వీల్లేని జ్యోతి"

నెహ్రూ అభ్యుదయ పక్షపాతి. తన దేశాభ్యుదయాన్ని మాత్రమేగాక, యావత్తు మానవాళి అభ్యుదయాన్ని కూడ ఆయన కాంక్షించారు. అయితే అది ఎంతటి మూల్యమయినా సరే చెల్లించే ప్రగతి కాదు. లక్షలాది ప్రాణాల్ని బలిపెట్టి ప్రగతి సాధించజాలము. నెహ్రూ గొప్ప మానవతావాది. ప్రగతి, మానవతావాద ఆశయాలకు విరుద్ధంగా వుండకూడదనీ, అలా వుండజాలదనీ ఆయన గుర్తించారు. ప్రగతి అంటే, ప్రతి ఒక్క వ్యక్తికీ సర్వతోముఖాభివృద్ధి సాధించేందుకు వీలు కల్పించటమని ఆయన అర్థం చేసుకున్నారనేది నిస్సందేహం. సోవియట్ యూనియన్ ఆచరణలో సాధించిన విజయాలను చూచి ఎంతో ముగ్ధులవుతున్నామని ఆయన చెప్పారు. "సోవియట్ విప్లవం వల్ల మానవ సమాజం పెద్ద గెంతుతో ముందుకు సాగింది. ఆ విప్లవం ఆర్పివేయ వీల్లేని ఒక మహోజ్వల జ్యోతిని వెలిగించింది. ప్రపంచ పురోగమనానికి లక్ష్యంగా వుండగల నూతన నాగరికతకు పునాదులు వేసింది. ఇది నిస్సందేహం" అని ఆయన అభిప్రాయం.

బ్రిటిష్ వలస ప్రభుత్వ సెన్సార్ అధికారులు సోవియట్ యూనియన్ గురించిన ఎలాటి అనుకూల అభిప్రాయాన్నయినా సరే "గట్టిగా నిరసించేవారు" అయినప్పటికీ, తమ దేశం స్వతంత్రం కోసం పోరాడుతున్న రోజుల్లోనే, సోవియట్ యూనియన్‌లో జరుగుతున్న బ్రహ్మాండమయిన మార్పుల గురించి సాధ్యమయినంత ఎక్కువ మంది

భారతీయులకు తెలియజేయటంలో నెహ్రూ చాలావరకు కృతకృత్యులయారు. సోవియట్ దేశం సాధించిన విజయాల గురించి తెలుసు కోవాలన్న విశాల భారత ప్రజల అభీష్టాన్ని ఈ విధంగా ఆయన నెరవేర్చారు.

పంచవర్ష ప్రణాళికలు, పారిశ్రామికీకరణ, వ్యవసాయరంగ సమిష్టీకరణ, విద్యుదీకరణ, జాతుల సమస్యను పరిష్కరించటం, శాస్త్ర, సాంస్కృతిక రంగాలలో సాధించిన విజయాలు, మొత్తంపైన సోవియట్ యూనియన్‌లో జరుగుతున్న ఘటనలన్నీ, భారత దేశంలో సోషలిస్టు భావాల ప్రభావాన్ని యినుమడింప జేశాయి; ముఖ్యంగా కార్మిక, కర్షకుల్లో, తీవ్రవాద భావాలు కల యువకుల్లో, ప్రజాతంత్రవాదుల్లో అవి విస్తారంగా వ్యాప్తి చెందేందుకు వీలు కల్పించాయి అని ఆయన చెప్పారు.

పునరుజ్జీవం పొందేందుకు, విముక్తి సాధించుకొనేందుకు పోరాడుతున్న ప్రజలు తమ పోరాటానికి ప్రపంచ వ్యాప్తంగా, చారిత్రక స్థాయిలో ఎలాంటి ప్రాముఖ్యం వుందో సరిగా అర్థం చేసుకొనేందుకు రష్యాలో సోషలిస్టు విప్లవమూ, సోషలిజం నిర్మాణంలో సాధించిన విజయాలూ తోడ్పడ్డాయి. భారత దేశ సమస్యలూ, దాని పోరాటమూ ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న బ్రహ్మాండమైన పరిణామాల్లో, సర్వత్రా జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో అభివృద్ధి చెందిన వివిధ రాజకీయ, ఆర్థిక శక్తుల మధ్య జరుగుతున్న బ్రహ్మాండమయిన పోరాటంలో భాగమేనని ఆయన తెలియచేశారు.

సోషలిజం, కమ్యూనిజంలు తనను చిరకాలంగా ఆకర్షిస్తూ వచ్చాయనీ, రష్యా కూడ తనను ఆకర్షించిందనీ ఆయన రాశారు. చివరకంటా చూస్తే, తాను పూర్తిగా రష్యాపక్షాన్నే వున్నాననీ, అంధకార బంధురమయిన నిరాశాపూరిత ప్రపంచానికి, సోవియట్ యూనియన్ ఉనికీ, ఆదర్శమూ, ఉజ్వలమైన, సంతోషదాయకమైన అంశంగా వుందని కూడ ఆయన రాశారు.

మరింత దృఢమైన ప్రాతిపదికపై స్నేహం

రెండవ ప్రపంచ యుద్ధంలో సోవియట్ యూనియన్ విజయం, వలస వ్యవస్థ విచ్ఛిత్తి, శక్తివంతమయిన సోషలిస్టు కుటుంబం ఏర్పాటు కావటం, భారతదేశం స్వతంత్రం కావటం—ఇవి సోవియట్ యూనియన్‌కూ భారత దేశానికీ మధ్య స్నేహ సంబంధాల అభివృద్ధికి పూర్తిగా కొత్త పరిస్థితులను కల్పించాయి. మన దేశాల మధ్య సంబంధాలు నానాటికి మరింత బహుముఖమూ,పరిపుష్టమూ, పటిష్టమూ అయాయి. సోవియట్ యూనియన్‌లో నెహ్రూ, భారత దేశంలో సోవియట్ యూనియన్ నాయకులూ జరిపిన చరిత్రాత్మక పర్యటనలు సోవియట్-భారత స్నేహాభివృద్ధినీ, పరిణతినీ సూచించే ముఖ్య ఘట్టాలు.

మొదటిసారి సోవియట్ యూనియన్‌ను సందర్శించిన 28 సంవత్సరాల తరువాత ఆయన మళ్లీ సోవియట్ యూనియన్‌కు వచ్చారు. సోవియట్ యూనియన్‌పట్ల, దాని అనుభవం పట్ల, దాని చారిత్రక పాత్రపట్ల, నెహ్రూ వైఖరి యథాతథంగానే వుండ

టాన్ని సోవియట్ ప్రజలు సంతృప్తితో గమనించారు. 1955 వేసవిలో తాను జరిపిన సోవియట్ పర్యటన లక్ష్యాన్ని గురించి చెబుతూ ఆయన భారతదేశం,సోవియట్ యూనియన్ నుంచి నేర్చుకోవలసింది ఎంతైనా వుందన్నారు. స్నేహమూ, పరస్పర విశ్వాసమూ రెండు దేశాలకూ లాభదాయక మన్నారు. అందుకనే, సోవియట్ ప్రజలను కలుసుకోవాలనీ, వారేమి సాధించిందీ వారి నోట వినాలనీ, కండ్లారా చూడాలనీ తాను అభిలషిస్తున్నానని కూడ ఆయన చెప్పారు.

సోవియట్ యూనియన్ అనుభవమూ, దాని విజయాలూ, ప్రగతి పథంలో అది ఆత్మవిశ్వాసంతో, స్థిరంగా సాగిస్తున్న పురోగమనమూ, స్వతంత్ర భారత దేశానికి జ్ఞానదాయకమైన ఆదర్శంగా వున్నవని ఆయన ఈ పర్యటన సందర్భంలో పలుసార్లు నొక్కి-చెప్పారు. కొత్తగా సాగులోకి తెచ్చిన బీడు భూముల ప్రాంతాన్ని ఆయన చూచారు. చిరకాలం బీడు పడివున్న భూముల అభివృద్ధి గురించి తాను ఎంతో విన్నాననీ, ఆ భూములను స్వయంగా చూడాలనీ, ఆ కృషిలో పాల్గొంటున్న ప్రజల అనుభవాల్ని స్వయంగా వినాలని అభిలషించాననీ ఆయన అన్నారు. వారిని ఉద్దేశిస్తూ ఆయన యిలా అన్నారు: "మీరు చాలా సాహసవంతులు. గట్టివారు. మీరు చాలా గొప్ప కార్యం సాధించారు. మీకున్న లాంటి సమస్యలే మాకూ చాలా వున్నవి. మీనుంచి మేము నేర్చుకోవలసి వుంది." సోవియట్ హయాంలో నిర్మాణమైన, ఆధునిక భారీ పరిశ్రమలున్న స్వెర్ డ్లోవ్స్క్ నగరంలో ప్రసంగిస్తూ, అక్కడ జరుగుతున్న బ్రహ్మాండమయిన కృషి తనకు తెలుసు నన్నారు. ఎన్నో పుస్తకాలు చదివినందువల్ల, ఈ దశలో సోవియట్ యూనియన్ సాధించిన ప్రగతిని బాగా శ్రద్ధతో అధ్యయనం చేసినందువల్ల, తనకీ విషయం బాగా తెలుసునని ఆయన చెప్పారు.

మన రెండు దేశాల స్నేహ, సహకారాల మూలాన్ని ఆయన ఎంత లోతుగా అర్థం చేసుకున్నారో యిదంతా నిరూపిస్తున్నది.

అయితే, ఆయనే చెప్పినట్లు, మన పద్ధతుల్లో వ్యత్యాసం వుందనే విషయాన్ని ఆయన దాచలేదు. అయినప్పటికీ, సామాజిక వ్యవస్థలలో వ్యత్యాసమున్నా, అభివృద్ధి, ప్రగతుల విషయంలో సోవియట్ యూనియన్, భారత దేశాలకు గల ఉమ్మడి ఆసక్తి, ఉమ్మడి కర్తవ్యాల నిర్వహణలో సహకారానికి భౌతిక ప్రాతిపదికగా వుంది. ఇక ముందూ అలానే వుంటుంది.

అత్యుత్తమ స్మృతి చిహ్నం

ఈ నాడు మనం నెహ్రూ సిద్ధాంత వారసత్వాన్ని గురించి ఆలోచించేటప్పుడు,వాస్తవ దృష్టినీ, ఆశావాదాన్నీ ఆయన అపూర్వంగా మేళవించిన తీరును, ఆయన సూక్ష్మబుద్ధిని, విజ్ఞతను కొనియాడకుండా వుండజాలము. సోషలిజంపై నెహ్రూ భావాలు, సోషలిజం గురించిన మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంతానికి అనుగుణంగా లేకపోయినప్పటికీ, సోవియట్ యూనియన్‌లో సోషలిజం నిర్మాణానుభవం ఆయనపై ప్రగాఢ ప్రభావం ప్రసరించిందని చెప్పటం అతిశయోక్తి కాదు.

పునరుజ్జీవం పొందుతున్న భారత జాతికి విజ్ఞతా, దూరదృష్టి గల నాయకుడుగా, సోవియట్ భారత స్నేహ సంబంధాలను పటిష్టం చేసేందుకు, శాంతిని బలవత్తరం చేసేందుకు గొప్ప కృషి చేసినవారుగా, జవాహర్లాల్ నెహ్రూ పట్ల సోవియట్ దేశ ప్రజలకు గొప్ప గౌరవ భావం వుంది.

మన రెండు దేశాల మధ్య స్నేహానికి ఆయన దృఢమయిన పునాది వేశారు. ఈ స్నేహాన్ని మరింత పెంపొందించి, విస్తరింప జేయటమే ఆయనకు అత్యుత్తమ స్మృతి చిహ్నం కాగలదనేది నిస్సందేహం.

దెబ్బతో కూల్చివేయడానికి ప్రయత్నించిన 1967 లో గానీ, పదికోట్ల మంది అరబ్బులను పాదాక్రాంతులను చేయాలని ఇజ్రాయిల్ నిరంకుశ సైనికాధికారులు కలలు కంటున్న ఈనాడు గానీ, ఇజ్రాయిల్ చర్యలు ఎంత మాత్రమూ "మనుగడ కోసం పోరాటం" కాదని అమెరికాలో కొందరికి బాగా తెలుసు.

మధ్యప్రాచ్యంలోని సంఘటనల పట్ల సోవియట్ దేశ వైఖరిని గురించి చెప్పేటప్పుడల్లా, అమెరికా పత్రికలూ, పాశ్చాత్య దేశాలలోని యూదు దురహంకారవాద అనుకూల పత్రికలూ విషయాలను వక్రంగా చిత్రించడం, అన్యాపదేశంగా ఆరోపణలు చేయడం, వాస్తవాలను కప్పిపుచ్చడం వంటి పద్ధతులను మరింత ఎక్కువగా వినియోగిస్తుంటాయి.

మధ్యప్రాచ్యంలోని పరిణామాలపట్ల సోవియట్ దేశ వైఖరి, అరబ్-ఇజ్రాయిల్ సంఘర్షణ అంతస్సారాన్ని గురించిన దాని అంచనాను బట్టి వుంది. మధ్యప్రాచ్య సంక్షోభాన్ని జాతీయ ప్రయోజనాల మధ్య సంఘర్షణగా సోవియట్ దేశం పరిగణించడం లేదు. ప్రపంచ సామ్రాజ్యవాదం ఇజ్రాయిల్ నాయకుల సహాయంతో అరబ్బు దేశాలలోని జాతీయ విముక్తి ఉద్యమాన్ని దెబ్బ గొట్టడానికి చేసే ప్రయత్నంగా పరిగణిస్తోంది; ఈ ఇజ్రాయిల్ నాయకులకు సైతం విస్తరణవాద లక్ష్యాలున్నాయని భావిస్తోంది.

దౌత్యరంగంలో అమెరికా చర్యలు ముమ్మర మయ్యాయనీ, మధ్యప్రాచ్యంలో రాజకీయ పరిష్కారం కోసం అమెరికా కృషి చేస్తోందనీ ప్రజలకు అభిప్రాయం కలగడానికై, మితవాద బూర్జువా పత్రికలు సర్వవిధాలా ప్రయత్నిస్తున్నాయి. అమెరికా ప్రభుత్వం ఏ ఎత్తుగడ వేసినా, పత్రికలు దాన్ని "కొత్త చొరవ" అని అంటున్నాయి. కాని, అదే సమయంలో 1967 నవంబరు 22 న, ఐరాస భద్రతా సంఘం ఆమోదించిన తీర్మానాన్ని అమలు జరిపించే విషయమై సోవియట్ ప్రతిపాదనల ఊసే అవి ఎత్తడం లేదు; అలాంటి ప్రతిపాదనలనేవే లేనట్లు వ్యవహరిస్తున్నాయి. ఈ ప్రతిపాదనలు నిర్దిష్టమైనవీ, స్పష్టంగా వెల్లడింపబడినవీ మధ్యప్రాచ్య దేశాలకన్నిటికీ శాంతి, భద్రతలను సమకూర్చగలిగినవీ.

ఈ సంఘర్షణలోని అన్ని పక్షాల దృక్పథాలనూ, మధ్యప్రాచ్య సంక్షోభ పరిష్కారానికి సంబంధించిన అన్ని సమస్యలపై జరిగిన ద్విపక్ష, చతుష్పక్ష సమాలోచనలనూ దృష్టిలో పెట్టుకొని మధ్యప్రాచ్య పరిస్థితిని గురించి పరిశీలించి, ఆ పరిశీలన ఆధారంగా సోవియట్ దేశం ఈ ప్రతిపాదనలు రూపొందించిందని చెప్పడం అవసరం. సోవియట్ పథకాన్ని, అందుకు సంబంధించిన దేశాలకు తగిన పద్ధతిలో సమర్పించడం జరిగింది. దానికి వివరణా, అనుబంధ సమాచారమూ ఇవ్వడం జరిగింది. సోవియట్ యూనియన్ తుది హెచ్చరికగా ఏ విధమైన శ్రీముఖమూ ఇవ్వలేదని వేరే చెప్పనవసరం లేదు. దీర్ఘకాలంగా నానుతూవున్న సంఘర్షణ పరిష్కారం కావడానికి ఆచరణ పూర్వకంగా తోడ్పడాలనీ, మధ్యప్రాచ్యంలో న్యాయమైన శాశ్వతమైన శాంతిని నెలకొల్పాలనీ సోవియట్ దేశానికి గల కోర్కె ఈ ప్రతిపాదనలకు కారణం.

31

అంతర్జాతీయ వ్యవహారాలు

న్యాయమైన శాంతికి మార్గం

మధ్యప్రాచ్య సంఘర్షణను రాజకీయంగా పరిష్కరించడానికి సోవియట్ ప్రతిపాదనలు

వై. ప్రిమకోవ్

మధ్యప్రాచ్య సంఘర్షణ పరిష్కారం కాకుండా మూడేళ్లగా సానుతూ వుంది; ఇది, ఈ ప్రాంతాన్నే కాక, యావత్ ప్రపంచాన్నే ఉద్రిక్త స్థితిలో వుంచుతోంది.

అమెరికాలో అధికారంలో వున్న రాజకీయవర్గాల మద్దతుతో, ఇజ్రాయిల్ ప్రభుత్వం, మధ్యప్రాచ్య సంఘర్షణ రాజకీయంగా పరిష్కారం కాకుండా, ప్రతిష్ఠంభనలో వుంచేందుకై మునుపటి లాగానే అడ్డుపుల్లలు వేస్తూనే వుంది.

అభివృద్ధి నిరోధక బూర్జువా పత్రికలు, మధ్యప్రాచ్య పరిణామాలను నిర్ణయించే అనేక వాస్తవాలను, పూర్తి వక్రంగానో లేదా, తల్లకిందులుగానో చిత్రిస్తున్నాయి. మరి కొన్నింటితో గారడీ చేస్తున్నాయి; కొన్నింటిని అసలు ప్రస్తావించడమే లేదు. పత్రికలు, రేడియో, టెలివిజన్, పుస్తకాలు, వార మాస పత్రికలు మొదలయిన సమాచార సాధనాలద్వారా, మధ్యప్రాచ్యానికి సంబంధించిన ఇటీవలి చరిత్రను గురించి గానీ, అక్కడి వర్తమాన సంఘటనలను గురించి గానీ వాస్తవమైన ఖచ్చితమైన అవగాహనకు రాజాలమని ఐక్య అరబ్ రిపబ్లిక్‌లోని అమెరికా మాజీ దౌత్యవ్యవహర్త దేవిడ్ నెస్ బహిరంగంగా అంగీకరించారు.

1967 జూన్‌లో అరబ్ దేశాలపై దాడి చేసిన ఇజ్రాయిల్, ఐ రా స తీర్మానాన్ని ధిక్కరించి, విస్తారమైన అరబ్ భూభాగాలను ఆక్రమించుకొని కూర్చుంది; అరబ్ రాజ్యాలపై సైనిక బందిపోటు దాడులను ఇంకా సాగిస్తూనే వుంది. అటువంటి ఇజ్రాయిల్‌ను అరబ్ శాత్రవ సముద్రంలో "రక్షణలేని చిన్న దీవి"లాగానూ, ఆ సముద్రం దాన్ని ఏ క్షణమైనా కబళించి వేయడానికి సిద్ధంగా వున్నట్లుగానూ అమెరికా ప్రచారకులు చిత్రిస్తున్నారు.

అయితే, సూయెజ్ కాలువ కంపెనీ జాతీయకరణకు ప్రతీకారంగా ఆ దేశంపై త్రిపక్ష కూటమి బందిపోటు దాడి జరిపిన 1956 లో గానీ, ఇజ్రాయిల్ ఉగ్రవాదుల నాయకులు అమెరికా మద్దతుతో, ఐక్య అరబ్ రిపబ్లిక్, సిరియాల ప్రగతిశీల ప్రభుత్వాలను ఒక్క-

మధ్యప్రాచ్యంలో మామూలు పరిస్థితులను నెలకొల్పడానికి సోవియట్ దేశం ప్రతిపాదించిన పథక మేమి?

మొదటిది, మధ్యప్రాచ్యంలో న్యాయమైన, శాశ్వతమైన శాంతి నెలకొనవలసిన ఆవశ్యకతను దృష్టిలో పెట్టుకొని, ఈ ప్రతిపాదనలను రూపొందించాము. మన మనస్సులో వుండేది ఖచ్చితంగా శాశ్వత శాంతే కాని, అస్థిరమైన కాల్పుల విరమణ కాదు. దురాక్రమణదారును ప్రోత్సహించడం ద్వారా ఇలాంటి శాంతిని నెలకొల్పలేము; ఇజ్రాయిల్ సైన్యాలు ఆక్రమించుకొన్న విస్తార అరబ్ భూభాగాలనుంచి అవి వైదొలగితే తప్ప, ఇలాంటి శాంతిని పటిష్ఠం చేయలేము.

క్షేమంగా, స్వతంత్ర జాతీయ రాజ్యాలుగా మనడానికి మధ్యప్రాచ్యంలోని రాజ్యాలకన్నిటికీ హక్కున్నదనే భావనతోనే సోవియట్ యూనియన్ ఎల్లప్పుడూ వ్యవహరిస్తూ వచ్చింది; ఇకముందూ అలాగే వ్యవహరిస్తుంది. సోవియట్ పార్లమెంటు గత సమావేశం ఆమోదించిన ప్రకటన ఇలా మరొక్కసారి నొక్కి చెప్పింది:

"ఇజ్రాయిల్ దురాక్రమణకు వ్యతిరేకంగా అరబ్ రాజ్యాలు ధైర్యంతో సాగిస్తున్న పోరాటంలో వాటికి సర్వతోముఖ సహాయం ఇవ్వాలనే సోవియట్ ప్రభుత్వ విధానాన్ని సోవియట్ యూనియన్ సుప్రీం సోవియట్ పూర్తిగా ఆమోదిస్తోంది; మధ్యప్రాచ్య సంఘర్షణకు న్యాయమైన, శాంతియుతమైన రాజకీయ పరిష్కారాన్ని సాధించడం ఈ విధాన లక్ష్యం.

"స్వయంపాలిత జాతిగా, స్వతంత్రంగా, భద్రంగా మనే హక్కు మధ్యప్రాచ్యంలోని ప్రతి రాజ్యానికి ఉందని సోవియట్ యూనియన్ సుప్రీం సోవియట్ నొక్కి చెబుతోంది."

మధ్యప్రాచ్య సంక్షోభానికి న్యాయమైన పరిష్కార పద్ధతిని రూపొందించవలసిన కారణం, అది నైతికంగా అవసరమై వుండటమే కాదు. నీతికి సంబంధించిన అంశం చాలా ముఖ్యమైనదే, కాదనము. న్యాయం జరగనిదే, అంటే అరబ్ భూభాగాలపై ఇజ్రాయిల్ ఆక్రమణ రద్దు కానిదే, యుద్ధ స్థితిని రద్దు చేయడమే కాక, ఈప్రాంతాలలోని రాజ్యాల మధ్య శాంతిని కూడ నెలకొల్పనిదే, పాలస్తీనా అరబ్బుల హక్కులను గుర్తించనిదే సమస్య స్థిరంగా పరిష్కారం కాదు. ఆల్సాస్, లొరైన్‌ల ఆక్రమణవల్ల యూరపు రాజకీయాలలో యుద్ధం శాశ్వతమైన అంశమైందని ఎంగెల్స్ ఒకప్పుడు రాశారు. ఇజ్రాయిల్ అరబ్ భూభాగాలను ఆక్రమించుకోవడంవల్ల, మధ్యప్రాచ్యంలో యుద్ధం తప్పని సరియైన పరిణామమయిందని భావించడానికి అంత కారణమూ లేదా?

ఇది ఇలా వుండగా, పాలస్తీనా కాందిశీకులను తిరిగి వారి స్వస్థలాలకు పంపాలనీ లేదా, వారు కోల్పోయిన ఆస్తికి నష్టపరిహారం చెల్లించాలనీ చెప్పే ఐ రా స తీర్మానాలు అనేక మున్నాయని మనకు తెలుసు. మధ్యప్రాచ్యంలో దృఢమైన శాంతిని నెలకొల్పాలంటే, పాలస్తీనా కాందిశీకుల సమ సమస్యను పరిష్కరించడం స్పష్టంగా అవసరం. ఇతరజాతుల జాతీయ హక్కులను పూర్తిగా నిరాకరించి, ఒక జాతికి లేదా కొన్ని

జాతులకు "స్వయం నిర్ణయ హక్కు" ఇవ్వటానికి ప్రయత్నించడం కూడ ఆక్షేపణీయమైనదని మన అభిప్రాయం.

రెండవ విషయం. మన ప్రతిపాదనలు మధ్యప్రాచ్యంలో శాంతిని ప్రకటించడానికే కాక, ఉభయపక్షాలపైన కొన్ని బాధ్యతలను మోపే ఒప్పందం వాటిమధ్య జరగడానికి కూడ వీలు కలిగిస్తోంది. ఐ రా స ప్రధాన కార్యదర్శి ప్రత్యేక రాయబారి అయిన యారింగ్ ద్వారా సంబంధాలు ఏర్పరచుకోవడం యిందుకు నేడు స్పష్టమైన మార్గం.

యారింగ్‌కు నిర్దేశించిన కర్తవ్యాలు అమలు జరగాలని సోవియట్ యూనియన్ గతంలోనూ, ఇప్పుడూ కోరుతూవుంది. అయితే, ఈ కర్తవ్యాల నిర్వహణే ఒక చరమ లక్ష్యమా? కాదని వేరేచెప్ప నవసరంలేదు. ఉభయపక్షాలకూ యారింగ్ ద్వారా సంబంధాలు ఏర్పడే పరిస్థితి రావాలి. 1967 నవంబరు 22 న ఐ రా స భద్రతా సంఘం ఆమోదించిన తీర్మానాన్ని అమలుజరిపే నిర్దిష్ట మార్గాలను కనుగొనడం యారింగ్ కర్తవ్యం. ఆక్రమిత ఆరబ్ భూభాగాల నుంచి ఇస్రాయిల్ సైన్యాలు వైదొలగడం, ఆరబ్ దేశాలకూ ఇస్రాయిల్‌కూ మధ్య యుద్ధస్థితి అంతం కావడం, భద్రమైనవని అందరూ గుర్తించిన సరిహద్దులలో ఆదేశాలు శాంతియుతంగామనే హక్కు, జలసంధులలో నౌకాయాన స్వేచ్ఛ, పాలస్తీనా కాందిశీకుల సమస్యను పరిష్కరించడం—వీటన్నిటికీ ఈ తీర్మానం వీలు కల్పిస్తోంది.

యారింగ్ రాయబారం జయప్రదం కావాలంటే, అన్నిటికన్న ముఖ్యంగా, ఉభయపక్షాలూ భద్రతాసంఘ తీర్మానాన్ని మొత్తంగా అమలు జరపడానికి తాము సిద్ధంగా వున్నామని చిత్తశుద్ధితో, నిర్ద్వంద్వంగా ప్రకటించడం అవసరం. ఇటువంటి ప్రకటనను ఐక్య ఆరబ్ రిపబ్లిక్ యిదివరకే చేసింది. ఇస్రాయిల్ యొక్క దురాక్రమణ దుష్ఫలితాలను తొలగించే కృషికి ఈ దేశం అందరి కన్న ఎక్కువగా తోడ్పడుతోంది.

ఇస్రాయిల్ మాటలనుబట్టి చూస్తే ఈ తీర్మానాన్ని అమలు జరపడానికి అది సమ్మతించినట్లు పైకి కనిపిస్తుంది. అయితే, అది తన సమ్మతిని మరీ అనిర్దిష్టంగా, అస్పష్టమైన రూపంలో వెల్లడించింది. ఇది ఇలావుండగా, ఇస్రాయిల్ నాయకులు ఆ తరువాత చేసిన ప్రకటనలు భద్రతాసంఘ తీర్మానంలోని అంశాలకు ఎంత విరుద్ధంగా వున్నాయంటే, ఇస్రాయిల్ సమ్మతి చిత్తశుద్ధితో కూడినది కాదేమోనని ఎవరైనా అనుమానించక మానరు.

మూడవవిషయం. పైన పేర్కొన్న భద్రతాసంఘ తీర్మానంలోని వివిధాంశాలన్నీ ఆచరణలో అమలు జరగడానికి సోవియట్ ప్రతిపాదనలు హామీలు కల్పిస్తోన్నాయి. ఈనాడు సమస్య పరిష్కారానికి సంబంధించిన రెండు ప్రధానాంశాల విషయంలో దృఢవైఖరి అవలంబించడం ప్రత్యేకించి ముఖ్యం-ఒకటి, 1967 లో ఆక్రమించుకొన్న అన్ని అరబ్ భూభాగాలనుంచి ఇస్రాయిల్ సైన్యాలు వైదొలగడం, రెండవది, అదేసమయంలో, మధ్యప్రాచ్యంలో న్యాయమైన, శాశ్వతమైన శాంతిని నెలకొల్పడం. ఈ రెండు అంశాలు ఒకదానితో ఒకటి అంగాంగికంగా ముడిపడి

వున్నాయి; రెంటినీ ఒక అఖండాంశంలోని భాగాలుగా పరిగణించాలి.

ఈ రెండు సమస్యల పరిష్కారాన్ని సోవియట్ ప్రతిపాదనలు కిందివిధంగా సమన్వయ పరుస్తున్నాయి: యారింగ్ మధ్యవర్తిత్వం ద్వారా తయారయిన తుదిపత్రం ఐ రా సకు అందజేయబడిన వెనువెంటనే, ఉభయపక్షాలూ యుద్ధస్థితి రద్దుకు భంగకరమైన సమస్త చర్యలనూ మానుకోవాలి; 1967 జూన్‌లో ఆక్రమించుకొన్న భూభాగాలనుంచి ఇజ్రాయిల్ సైన్యాల ఉపసంహరణ ప్రథమదశ పూర్తి కావడంతో (ఈ ఉపసంహరణ రెండు దశలలో జరగవచ్చు.) యుద్ధస్థితి అంతమై, న్యాయశాస్త్రరీత్యా శాంతిస్థాపన ప్రారంభమవుతుంది.

ఇజ్రాయిల్ నాయకులు "భద్రత చేకూర్చే సరిహద్దులు" అంటూ మాట్లాడుతుంటారు. వాటిని గురించి ఊహాగానాలు చేస్తుంటారు. వాస్తవంలో, "భద్రత చేకూర్చే సరిహద్దుల" స్థాపన ముసుగులో చేసే ప్రతిపాదనలన్నీ ఆచరణలో హద్దూ పద్దూలేని ఇజ్రాయిల్ విస్తరణ పథకాలే. ఉదాహరణకు; జోర్డాన్ నది ఇజ్రాయిల్‌కు "భద్రత చేకూర్చే సరిహద్దు"గా వుండగలదని చెప్పేవరకు ఇజ్రాయిల్ సర్వ సైన్యాధిపతి వెళ్ళారు. ఆయుధాలు మహావేగంతో అభివృద్ధి చెందుతున్న ఈ యుగంలో, ఈ రోజుల్లో, ఒకానొక సరిహద్దుకు భద్రత చేకూర్చేందుకు మార్గం, దాన్ని కొన్నిమైళ్ళు ఆవలికి మార్చడం కాదు; దాన్ని అందరూ గుర్తించేలా చేయడమే మార్గం. నేడు ఇజ్రాయిల్ నాయకులకు ఇతరుల భూభాగాలను "భుక్తం" చేసుకొనే విస్తరణవాద పథకాలు మినహా, మరే యావ లేకపోతే, ఈ ప్రాంతంలో ఇజ్రాయిల్‌తో సహా అన్ని రాజ్యాల సరిహద్దులకు పూచీ యిచ్చే ప్రతిపాదనలను వారు మరింతశ్రద్ధతో పరిశీలించేవారే. ఇవి 1967 జూన్ 4 న ఉన్న సరిహద్దు రేఖలకు అనుగుణమైనవి.

ఇక మధ్యప్రాచ్య రాజ్యాల సరిహద్దులకు హామీల సంగతి. యుద్ధంద్వారా భూభాగాలను ఆక్రమించుకోవడం అనుమతించరానిదనీ, ఒకదేశం మరోదేశ సర్వసత్తాకతనూ, భౌగోళిక సమగ్రతనూ, రాజకీయ స్వాతంత్ర్యాన్నీ గౌరవించాలనీ, ఒక దేశం మరొక దేశానికి వ్యతిరేకంగా శత్రు చర్యలను తనదేశ భూభాగంపై సాగకుండా నిరోధించడానికి శాయశక్తులా కృషిచేయాలనీ ఒకదేశం మరోదేశ ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకోకుండా వుండాలనీ భద్రతాసంఘం 1967 నవంబరు 22 న ఆమోదించిన తీర్మానం ప్రకారం అంగీకరిస్తూ, ఉభయపక్షాలపై నిర్దిష్టమైన బాధ్యతలను మోపే సోవియట్ ప్రతిపాదనలు మధ్యప్రాచ్య దేశాల సరిహద్దులకు హామీ కల్పిస్తున్నవి. ఈ సోవియట్ ప్రతిపాదనలు, సరిహద్దుకు రెండు వైపులా నిస్సైనిక మండలాలను నిర్దేశిస్తున్నాయి. అటువంటి మండలాలు ఏ పక్షానికీ ప్రత్యేక లాభం చేకూర్చవు. ఆ మండలాల పరిపాలక వ్యవస్థలో కేవలం సైనికసంబంధమైన అంశాలు అంతర్భాగంగా వుంటాయి. అవేమిటంటే, కొన్నిచోట్ల ఐ రా స సైన్యాలను వుంచడం, భద్రతాసంఘంలో శాశ్వత ప్రాతినిథ్యం వున్న నాల్గు అగ్రరాజ్యాలుగానీ,

లేదా, భద్రతాసంఘమే నేరుగా గానీ హామీలు యివ్వడం.

ఇవీ, సోవియట్ ప్రతిపాదనలు. అమెరికా సామ్రాజ్యవాద వర్గాల మద్దతుతో ఇజ్రాయిల్ నాయకులు, ఈ ప్రతిపాదనలు ఆమోదింపబడకుండా భగ్నంచేసి వుండకపోతే, మధ్యప్రాచ్యంలో ఏనాడో శాశ్వత శాంతి నెలకొని వుండేది.

ఇజ్రాయిల్ నాయకులు ఆశిస్తున్నదేమిటి? అరబ్బులు లొంగిపోతారని వారనుకొంటున్నారా? లేక దురాక్రమణకు వ్యతిరేకంగా సాగుతున్న ఈ న్యాయమైన పోరాటంలో సోవియట్ యూనియన్ అందిస్తున్న సహాయాన్ని తగ్గించివేస్తుం దనుకొంటున్నారా? ఈ రెంటిలో ఏదీ జరగనిది. ఇజ్రాయిల్ దురాక్రమణ ఫలితాలను రద్దు చేయడానికి అరబ్ దేశాలు సాగిస్తున్న పోరాటంలో వాటికి సంపూర్ణమైన అండదండలిస్తున్న సోవియట్ వైఖరి ఎన్నటికీ మారదు. అది ఎప్పటిలాగానే వుంది. సోవియట్ కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధానకార్యదర్శి కామ్రేడ్ యల్. ఐ. బ్రెజ్నెవ్ బాకూలో అక్టోబరు 2 న ఈ విషయాన్ని మరొక్కసారి స్పష్టం చేశారు. సోవియట్ కమ్యూనిస్టు పార్టీ, ప్రభుత్వ ప్రతినిధి వర్గం సోవియట్ దేశ మంత్రిమండలి అధ్యక్షుడు కామ్రేడ్ ఎ. యన్. కొసిగిన్ నాయకత్వాన యిటీవల ఐక్య అరబ్ రిపబ్లిక్‌ను సందర్శించిన సందర్భంలో వెలువడ్డ సంయుక్త ప్రకటనలో ఇదేవిషయాన్ని ఉద్ఘాటించారు. అధ్యక్షుడు నాజర్ మరణానంతరం సోవియట్ వైఖరి మారుతుందని ఇజ్రాయిల్, అమెరికాలు అనుకొంటున్నాయా? అవన్నీ వట్టి అడియాసలే! ఇజ్రాయిల్ దురాక్రమణకు గురియైన అరబ్ రాజ్యాలకు సర్వతోముఖ సహాయం ఇవ్వాలనే సోవియట్ విధానం భౌతికమైన, శాశ్వతమైన అంశాలపై ఆధారపడివుంది. సోవియట్ యూనియన్‌పై ఒత్తిడితెచ్చి—ఇది సూయజ్ మండలంలో యుద్ధ విరమణ "ఉల్లంఘనల"కూ, లేదా మధ్యప్రాచ్య సంక్షోభంపై నాల్గు అగ్రరాజ్యాల సమావేశానికి సంబంధించినది కావచ్చు—విజయం సాధించాలనే ఆశయు కూడ వట్టి భ్రమలే, పూర్తిగా ఆధార రహితమైనవే.

మధ్యప్రాచ్యం, సోవియట్ యూనియన్ సరిహద్దులకు ప్రత్యక్షంగా ఆనుకొనివున్న ప్రాంతం. అటువంటి ప్రాంతంలో దృఢమైన, న్యాయమైన శాంతిని నెలకొల్పాలనే కుతూహలంతో సోవియట్ దేశం అరబ్-ఇజ్రాయిల్ సమస్య పరిష్కారానికి పొందికైన, సవివరమైన కార్యక్రమాన్ని ప్రతిపాదిస్తోంది. ప్రపంచంలో ప్రమాదభరితంగా వున్న ఈ ప్రాంతంలో శాశ్వత శాంతికి దారి తీసే క్రమానికి ఈ ప్రతిపాదనలను ప్రాతిపదికగా చేసుకొనడం సమస్తదేశాల ప్రజలకూ ప్రయోజనకరం.

(ప్రావ్దా, అక్టోబరు 15.)

కళలూ, సాహిత్యము

సాహిత్యమూ, రాజకీయాలు

కామిల్ యాషెన్

ఆసియా. ఆఫ్రికా రచయితల సంబంధాల

సోవియట్ కమిటీ అధ్యక్షులు

ఆసియా, ఆఫ్రికా రచయితల నాలుగవ మహాసభ ఈ సంవత్సరం ఆఖరాలు కాలంలో ఢిల్లీలో జరుగనున్నది. సిద్ధాంతానికి, కళాసృష్టికి సంబంధించిన ముఖ్య సమస్యలను ఈ సభలో చర్చించటం జరుగుతుంది. 1958 లో తాష్కెంట్‌లో మొదటి మహాసభ జరిగిన తరువాత ఈ రచయితల ఉద్యమం ప్రపంచ సాహిత్యం లోని అనేక ధోరణులను, జాతీయ సాహిత్యాల పరిణామాన్ని, విముక్తి పోరాటాన్ని, ఆసియా, ఆఫ్రికా దేశాల ప్రజల నిర్మాణాత్మక కృషిని ప్రాభావితం చేయగల శక్తిగా అభివృద్ధి చెందింది.

సమాజంలో రచయిత నిర్వహించే పాత్రను, ప్రపంచమంతటా, సిద్ధాంతరంగంలో, కళాసృష్టిలో అభ్యుదయ రచయితలు ఈనాడు ఎదుర్కొంటున్న సమస్యలను, సుప్రసిద్ధ సోవియట్ రచయితా, ప్రముఖుడూ అయిన కామిల్ యాషెన్ ఈ వ్యాసంలో చర్చించారు.

"కళ ప్రజలకు చెందినది" అని లెనిన్ సుస్పష్టంగా చేసిన సూత్రీకరణ ఈనాడు ప్రపంచమంతటా తెలుసు. సాహిత్యమూ, కళలూ గురించి లెనిన్ అనేక వ్యాఖ్యలు చేశారు. వాటిలో ఈ భావాన్ని అభివృద్ధిపరచి, దానికి మరింత నిర్దిష్ట రూపం యివ్వటం జరిగింది. నిజాయితీపరులు, ప్రగతిశీలురూ అయిన సాహితీపరుల సృజనశీల మార్గాలనూ, అన్వేషణలనూ, సర్వత్రా అభ్యుదయ సాహిత్యయితోధిక అభివృద్ధినీ, లెనిన్ భావాలు ప్రదీప్తం చేస్తున్నవి. ఇకముందూ మరింతగా ప్రదీప్తం చేస్తూ వుంటాయి.

సాహిత్యంలో పార్టీతత్వం, గతకాలపు సాంస్కృతిక వారసత్వం, కళలోని జాతీయ, అంతర్జాతీయ అంశాలు—వీటి గురించిన లెనిన్ భావాలు మా సోషలిస్టు కళ పాటుకొల్పబడుతున్న సంవత్సరాలలో ఎంతటి నిర్ణయాత్మక ప్రాముఖ్యం వహించాయో, సోవియట్

ప్రాచ్య ప్రాంతాల సంస్కృతీ ప్రతినిధుల మైన మాకు, ప్రత్యేకించి వృద్ధతరం వారికి బాగా తెలుసు. తరుణ సోవియట్ రిపబ్లిక్ చరిత్రలోకెల్లా గడ్డు కాలంలో లెనిన్, సమర్ఖండ్‌లోని ప్రాచీన శిల్పాల సంరక్షణకు సంబంధించిన ఉత్తర్వుపై సంతకం చేశారు. అత్యుత్తమమయిన మా ప్రాచీన సంప్రదాయాలఎడ ఆయన వైఖరి నిది తెలియ జేస్తూంది. లెనిన్ జాతుల విధానం సోవియట్ యూనియన్‌లోని వివిధ జాతులకు స్వేచ్ఛా యుతమయిన సంబంధాలను, సాంస్కృతిక ఆదాన ప్రదానాలను అభివృద్ధి పరచుకునేందుకై విస్తార అవకాశాలు సమకూర్చింది.

మా సాహిత్యాల అభివృద్ధి, అవి ఒకదానినొకటి పరిపుష్టం చేయటం అనే జటిల క్రమంలో సంపన్నమయిన ప్రాచీన సాహిత్యమూ, సోవియట్ రష్యన్ సాహిత్యమూ నిర్ణయాత్మకమైన, ప్రధానమైన ప్రభావాన్ని ప్రసరించాయి. పుష్కిన్, టాల్‌స్టాయ్, చెర్నిషెవ్‌స్కీ, నెక్రసొవ్, గోర్కీ, మయకొవ్‌స్కీలనుంచి కళాత్మకమైన శిల్పాన్ని మేయి నేర్చుకున్నాం. ఇప్పటికీ నేర్చుకుంటూనే వున్నాం. ఆధునిక ప్రాచ్య సాహిత్యంలో ప్రత్యేకించి ముఖ్యమయిన ఒక విషయాన్ని అంటే, ప్రాచీన సంప్రదాయాలను, విప్లవాత్మకమయిన కొత్త పుంతలతో అంగాంగికంగా, ఫలవంతంగా మేళవించటాన్ని కూడా నేర్చుకుంటున్నాం.

ఈనాడు ఆసియా, ఆఫ్రికా దేశాలకు చెందిన అభ్యుదయ రచయితలు, సిద్ధాంతానికీ, కళాసృష్టికీ సంబంధించిన ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారు. పూర్వం రష్యనేతర రిపబ్లిక్‌లలో నూతన, సోవియట్ సాహిత్యం రూపు దిద్దుకుంటున్న కాలంలో మేము పరిష్కరించుకోవలసి వచ్చినలాంటి సమస్యలే యివి. భారత్, జపాన్, ఇరాన్ దేశాలకూ, కొన్ని అరబ్బు దేశాలకూ సంపన్నమైన, ఎన్నో శతాబ్దాల కాలపు ప్రాచీన సంస్కృతి వుంది. ఆ దేశాల సమకాలీన సాహిత్యంలో ఆ సంస్కృతీ సంప్రదాయాలు ఈనాటికీ బలంగానే వున్నవి. అయితే, మన యుగ నూతన భావాలను, పద చిత్రాలను, లయలను వ్యక్తీకరించేందుకు కొత్త సాధనాలు ఎంతైనా అవసరం అవుతున్నవి. పైజెప్పిన ప్రాచీన సంప్రదాయాలు ఎంత మానవతాయుతమయినప్పటికీ, కళాత్మకమయినప్పటికీ అవి కొన్ని సందర్భాలలో ఆధునిక రచయితల కళాసృష్టికి సంకెళ్ళుగా పరిణమిస్తున్నవి. ప్రాచ్య దేశాలలో ప్రాచీన కాలంనుంచీ, కళారంగంలో ఆత్మాభివ్యక్తి ప్రధాన రూపంగా వుంటూ వచ్చిన కవిత్వం విషయంలో యిది మరింత నిజం.

కొత్త భావ చిత్రాలు

ప్రాచ్య సాహిత్యంలో సాంప్రదాయికంగా వస్తున్న గులాబి, బుల్బుల్, దీపశిఖ, శలభమూలాంటి భావ చిత్రాలు, నేటి సంక్లిష్ట, తీక్ష్ణ సమస్యలను యిక నేమాత్రమూ వ్యక్తీకరించలేవు. చిరకాలంగా స్థిరపడిపోయిన రూపాలనుంచి, మత సంకేతాలనుంచి బైటపడి, మూలమట్టుగా కొత్త పుంతలు తొక్కటం, కొత్త భావాలకు, కొత్త వస్తువుకు కొన్ని సందర్భాలలో అవసరం. అనేక ప్రాచ్య దేశాలలోని కవులు యిటీవలి వరకూ

ఉపయోగిస్తూ వచ్చిన సాహిత్య భాషకు కాల దోషం పట్టింది. దాన్ని నిర్దుష్ట పరచటమూ, ఆధునికం చేయటమూ అవసరం. అందు కనే, సంప్రదాయానుసరణా, కొత్త పుంతలు తొక్కటమూ, వాటిని ఫలవంతంగా మేళ వించటమూ అన్న సమస్య, అనేక దేశాల, ముఖ్యంగా ఆసియా, ఆఫ్రికా దేశాల అభ్యు దయ సాహిత్యంలో సృజనాత్మక రచనకు సంబంధించిన అత్యవసర సమస్యలలో ఒకటయింది.

ఆఫ్రికా, ఆసియా దేశాల అభ్యుదయ రచయితలు సిద్ధాంతానికీ, కళాసృష్టికీ సంబం ధించిన అనేక యితర మౌలిక సమస్యల గురించి కూడా శ్రద్ధ వహిస్తున్నారు. దేశ దేశాల ప్రజలమధ్య ఆత్మిక ఆదాన ప్రదానాలు స్థిరంగా విస్తరిస్తున్నవి. ప్రపంచ మంతటికీ సంబంధించిన శాంతి, న్యాయం వంటి సమ స్యలు యావత్తు మానవ జాతిని సంచలింప జేస్తున్నవి. అందుకని ప్రపంచ మంతటా అభివృద్ధి నిరోధక, దుష్ట శక్తులకు వ్యతిరేకం గానూ, సచ్ఛీలు రయిన అందరికీ ఉమ్మడిగా వున్న మానవతాయుత, సామాజిక ఆశయాల సాధన కోసమూ జరిగే పోరాటంలో ఐక్యత ఎంతయినా అవసరం. ఈ సమస్యల దృష్ట్యా, అభ్యుదయ రచయిత ఎవ్వరూ, తన దేశ సరి హద్దులకు మాత్రమే పరిమితమై, ప్రపంచం నుంచి వేరుపడి వుండిపోవడం గానీ, తన దేశ ప్రజలకోసం మాత్రమే రాయడం గానీ తగదు.వారు తమ దేశ ప్రజల పక్షాన,ప్రపంచం లోని కోటానుకోట్ల ప్రజల హృదయాల్లో, మనస్సుల్లో నాటుకొనేలా, వారి అంతరాత్మ లను కదిలించేలా రాయాలి.దీని అర్థం ఏమంటే ఒక రచయిత చేసే రచన కేవలం జాతీయ మైనదిగా మాత్రమే వుండరాదు. దానికి అంతర్జాతీయతా లక్షణాలు కూడ వుండాలి. జాతీయ, అంతర్జాతీయ అంశాలను అంగాంగి కంగా మేళవించటమనేది, ప్రపంచ అభ్యు దయ సాహిత్యానికి నానాటికీ మరింత ముఖ్య మవుతూ వుంది.

సుప్రసిద్ధ మంగోల్ రచయిత్రి సొనొ మ్యన్ ఉద్వల్ యిలా చెప్పారు: "ఒక సాహిత్య రచన రూపం ఎంత జాతీయమైన దిగా వున్నా సరే, ప్రగతిశీల మైనదైతే, అభి వృద్ధి నిరోధకశక్తులను ఖండించేదైతే, మాన వతా యుతమైతే, అది అంతర్జాతీయమైన రచనే....మరో వంక, రచయితలకు, తమ ప్రజల జాతీయ లక్షణాలను, భావాలను ప్రతి బింబించే నిజమైన కళాత్మక సంప్రదాయాలు వుండటం చాలా ముఖ్యం". గొప్ప సోవి యట్ కవీ, ప్రముఖుడూ అయిన మిర్జా తుర్సన్-జాదే కైరోలో జరిగిన ఒక సమా వేశంలో యిలా అన్నారు: "ప్రాచ్య, పాశ్చాత్యదేశాల ప్రజలకు అత్యుత్తమ మైనదీ, విలువైనదీ అంతా, సమస్త మాన వాళికీ మేలు చేకూర్చుతుంది; కాగా, సంకు చిత జాతీయ మనస్తత్వ వ్యక్తీకరణ ఏదైనాసరే, నిజమైన జాతీయకళ అభివృద్ధికి అవరోధ మవుతుంది".

సిద్ధాంత, సామాజిక రంగాలలో పోరాటం

నేటి అభ్యుదయ సాహితీపరుల రచనలు సిద్ధాంత, సామాజిక పోరాటంతో, ప్రపంచ ఘటనలతో, ప్రపంచ రాజకీయాలతో ముడు

పటి కంటే చాలా ఎక్కువగా ముడిపడి వున్నవి. ఉదాత్తమైన కవిత్వాన్ని, రాజకీయ పోరాటానికి సంబంధించిన అతితీవ్రమైన, అత్యవసరమైన సమస్యలతో ఒక రచనలో మేళవించటం, విలీనం చేయటం సాధ్యమా? ఈ ప్రశ్నకు ఏనాడో సమాధానం యివ్వటం జరిగింది. జువెనాల్, డాంటే, బైరన్, హీన్ లాంటి గొప్ప ప్రాచీన రచయితల అనేక రచనల్లోనూ, భారత్, చైనా, పర్షియాదేశాల ప్రాచీన కవుల కృతుల్లోనూ యిందుకు చక్కటి ఉదాహరణలు మనకు లభిస్తున్నాయి. నిశితమైన వాస్తవికత వారి రచనలను వజ్రాయుధాలుగా మార్చింది. ప్రతిభావంతమయిన శిల్పాన్నీ, నిజమైన కవిత్వాన్నీ మేళవించి తయారుచేసిన ఆయుధాలివి. ఇవే వాటిని శతాబ్దాలుగా తుప్పు పట్టకుండా వుంచాయి. గొప్ప కవీ, చింతకుడూ అయిన అలీషెర్ నవోయ్ రచనలనే తీసుకోండి. ఆయన కవిత్వంలో నిండి నిబిడీకృతమై వున్నది తాత్విక, నైతిక చింతన మాత్రమేకాదు. ఆయన కాలపు అత్యంత పురోగామి రాజకీయ అభిప్రాయాలను కూడా అది ప్రతిబింబిస్తూ వుంది. లేదా ప్రాచీన జానపద కవిత్వాన్ని చూడండి. భారతదేశ మహాకావ్యమైన "మహాభారతం"లో, ఉజ్బెక్ జానపద దాస్తాన్ "అల్పమిష్"లో, "40 మంది బాలికలు" అనే కారకల్పక్ ప్రాచీన వీరగీతంలో, యితర ప్రాచ్య దేశాలలోని వీరరస ప్రధాన కావ్యాలలో, గేయాలలో పూర్వకాలంలో సాగిన తీక్ష్ణమైన రాజకీయ సంఘర్షణ ప్రత్యక్ష సూచనలు మనకు కనిపించడం లేదా?

ఏ యుగంలో నైనాసరే, ఏ దేశంలో నైనాసరే, ప్రజాసాహిత్యం, రాజకీయ జీవితంతోనూ, సామాజిక సంఘర్షణతోనూ సదా ముడిపడి వుంది. కాగా, "శుద్ధమైన కళ" ఎల్లప్పుడూ, రాజులు, మహారాజులు, ఖాన్‌లు, అమీర్లు మొదలయినవారి ప్రయోజనాలకే తోడ్పడుతూ వచ్చింది. ఇదంతా ఏనాడో నిరూపితమైనా, యిప్పటికీ విదేశాల్లో నికొందరు సోదర రచయితలకు ఈ విషయాన్ని పదేపదే చెప్పాల్సి వస్తూంది.

"శుద్ధమైన కళ", "తుపాకి చేతపట్టిన" సాహిత్యం

గడచిన పది పన్నెండేళ్లలో జరిగిన రచయితల సమావేశాల్లోనూ, గోష్ఠుల్లోనూ, సాహిత్యం రాజకీయాల జోలికి పోరాదనీ, అహింస పైన, శాంతి తత్వంపైన దృష్టి కేంద్రీకరించాలనీ, తీవ్రమైన నేటి సైద్ధాంతిక పోరాటానికి ఎడంగా వుండాలనీ కొందరు వాదించారు. లెనిన్ అన్నట్లు, "నిజంగా మోసపోయిన" ఈ "శుద్ధకళా" సమర్థకులకు ప్రముఖ ఈజిప్షియన్ రచయితా, ప్రముఖుడూ అయిన యూసుఫ్ అస్-సిబాయ్ (ఇప్పుడీయన ఆసియా, ఆఫ్రికా రచయితల సంఘానికి అధ్యక్షులు) ఈ విధంగా చెప్పారు: "సూర్యాస్తమయం, చంద్రోదయం, వీటి సౌందర్యాన్ని వర్ణిస్తూ రచయితలు రాయాలని మీరు ఆశిస్తున్నారు.... పువ్వుల్నీ, చిరునవ్వుల్నీ అంతా ప్రేమిస్తాం. కాని, నిజమైన స్వేచ్ఛాప్రియత్వానికి యిచ్చిన స్థానాన్ని, ప్రకృతి సౌందర్య పిపాసకు కట్టబెట్టబోము".

సాహిత్యం స్థానాన్ని సంపూర్ణంగా రాజ

కీయాలకు కట్టబెట్టాలని వాదించే వాగాడం బరులున్నారు. "తుపాకిని చేత పుచ్చుకుని" సాహిత్యసృష్టి చేయాలని వారు అంటాప. మా ప్రసిద్ధ కవి రసూల్ గమ్జతొవ్ యిలాంటి వారి ఆర్భాటానికి చక్కటి సమాధానమిచ్చారు. ఆయన అన్నది యిదీ: "మనకు యితర ప్రత్యర్థులూ వున్నారు. వారు ఏ విషయాన్నీ చర్చించకుండానే, ప్ర తి దా న్నీ ఖండిస్తారు. కవిత్వం, సంగీతం, ప్రక్రియలు, రీతులు గురించి మనం మాట్లాడుతూ ప్రధానమైన రాజకీయ యితివృత్తాలను వదిలేస్తున్నామని వారంటారు. సౌందర్యచర్చ వారికి ఆగ్రహం కలిగిస్తుంది... వా రి కి కావలసింది స్వర మాధుర్యంలేని సంగీతం, కల్పన లేని చిత్ర కళ. ఇవి రాజకీయాలు కావు. రాజకీయాలతో చెర్లాటం. మనం సజీవమైన మనుష్యులం; మనం జీవితం గురించీ, మరణం గురించీ సజీవంగా వున్నవారికి చెబుతాం .. లక్షలాది మందికి అర్థమయ్యేలా మనం వారి భావాలను, అనుభూతులను అందంగా, భావ చిత్రాలతో వ్యక్తీకరించాలి."

లెనిన్ అభిప్రాయాలు

ఇదంతా పాత కథే. లెనిన్ దూరదృష్టిగల తన విధానాన్ని, సాటిలేని ధైర్యంతో, దృఢ చిత్తంతో సమర్థించు కున్నప్పుడు ఆయన కూడా "మితవాదుల" నుంచీ, "అతి వాదుల" నుంచీ యిలాంటి విమర్శలే ఎదు రయ్యాయి; రాజీవాదుల జిడ్డుమాటలు, వాగా డంబరుల పరుషవాక్కులు ఎదురయ్యాయి. ఆయన విధానం ఒక్కటే సరైన విధానం. జీవిత తర్కానికి అనుగుణమైన విధానం. అది సరైనదని చరిత్ర శక్తివంతంగా, విస్పష్టంగా నిరూపించింది. లెనిన్ ఆదర్శాన్నుంచి మనం మరింత శక్తివంతంగా, పట్టుదలగా నేర్చు కుంటూనే వుంటాం. మన జీవితంలో, సృజ నాత్మక కృషిలో, సిద్ధాంత పోరాటంలో, సాహిత్య చర్చల్లో, లెనిన్ అంత దృఢంగా, పట్టుదలగా, అప్రమత్తులుగా, ధైర్యవంతు లుగా, దూరదృష్టి గలవారుగా వుండటం అలవరచుకుంటున్నాం.

భావమూ; యితివృత్తము, కళాత్మక విలువలు; సాహిత్యమూ, రాజకీయాలు; కళ, సమాజము; సంప్రదాయమూ, కొత్తపుంతలు, జాతీయ, అంతర్జాతీయ అంశాలు, వీటితో బాటు ప్రపంచ అభ్యుదయ సాహిత్యాభి వృద్ధికి నేడు ఎంతో ముఖ్యమైన అనేక యితర సమస్యలలో సారభూతమైవున్న విష యాన్ని కళా, సాహిత్యాలపై లెనిన్ వ్యాసాలు, వ్యాఖ్యలు స్పష్టాతిస్పష్టంగా వెల్లడిస్తున్నవి. భవిష్యత్తులోకి పరుగెడు తున్నదా అన్నట్లు తోపింపజేసే, హృదయో ద్వేగంతో ఆయన అర్ధ శతాబ్దం క్రితం రాసిన ఆ చిరపరచిత రచనలను, "పార్టీ నిర్మా ణము; పార్టీ సాహిత్యము" అన్న ప్రసిద్ధ వ్యాసాన్ని, లియో టాల్‌స్టాయ్ రచనల గురిం చిన వ్యాసాన్ని, మాగ్జిం గోర్కీకి రాసిన లేఖల్ని మనం పదేపదే చదివేకొద్దీ, వాటిలో తొణికిసలాడే జీవిత గభీర సత్యం, ఉద్వేగ పూరితమైన విప్లవ తత్వం, ఆత్మికౌన్నత్యం, అభివృద్ధి నిరోధకమైన, బద్ధ వ్యతిరేకమైన యావద్విషయాలపట్ల రాజీలేని వైఖరి, నవ జీవిత అంకురాలపట్ల, ప్రగతిశీలమైన వాట న్నిటిపట్ల సునిశిత ఆసక్తి మనన్ని ఆశ్చర్య

పరుస్తాయి. విశాలమైన ఆయన చారిత్రక దృష్టి, ఆయన ప్రశంసలలోని సూక్ష్మదృష్టి, నైతిత్యమూ, కళాసృష్టికి గల సామాజిక, రసాభిజ్ఞతా బీజాలను దర్శించగల ఆయన ప్రతిభా మాత్రమేగాక నిజంగా అపూర్వమైన ఆయన సూక్ష్మదృష్టి కూడ మనకు అబ్బుర పాటు గొల్పుతుంది; ఇది ఆయన రాసిన ప్రతి పదానికీ, నేడూ, యిక ముందూ తరగని నవ్యతనూ, వర్తమానానికి గూడ వర్తించే గుణాన్ని, అందరికీ చుక్కానిగా వుండే అద్భుత శక్తిని ప్రసాదిస్తున్నది.

మానవ జాతికి మరింత మేలయిన భవిష్యత్తుకోసం పోరాడేవారందరికీ లెనిన్ రచనల అధ్యయనం అవశ్యం మాత్రమే గాక గాఢమైన ఆత్మికానందాన్ని కూడా కలిగిస్తుంది.

అందుకనే, కమ్యూనిస్టులు మాత్రమేగాక, చిత్తశుద్ధిగలవారు, అభ్యుదయ భావాలు గల ప్రజానాయకులు, శాస్త్రవేత్తలు, రచయితలు, అన్ని దేశాలలోనూ, నానాటికి మరింత ఎక్కువ మంది లెనిన్ రచనలను, ఆయన కృషిని శ్రద్ధగా అధ్యయనం చేస్తున్నారు. అందుకనే ఆఫ్రికా, ఆసియాదేశాలకు చెందిన అభ్యుదయ రచయితలు అధికాధిక సంఖ్యలో, జీవధాతువు వంటి, లెనిన్ విజ్ఞతపట్ల ప్రగాఢ ఆసక్తి, అనురాగమూ చూపుతున్నారు. దాన్నుంచి, సత్యదృష్టిని, జ్ఞానాన్ని, బలాన్ని, ఆత్మస్థయిర్యాన్ని పొందుతున్నారు. సిద్ధాంతానికీ, కళాసృష్టికీ సంబంధించిన రంగాలలో తమను కలవరపెడుతున్న సమస్యలకు పరిష్కారం కనుగొంటున్నారు.

ఎ. పి. యస్.

43

SOVIET SAMEEKSHA

(TELUGU)

52 Vol. 4, Nov. 13, 1970

CONTENTS

44

సోవియట్ సమీక్ష

సంవత్సర చందా

రూ. 4-00

సోవియట్ భూమి కార్యాలయం,

టి. నగర్, మద్రాసు-17.

Bui

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	TPLA134M150
పుస్తకం పేరు	సోవియట్ సమీక్ష
తారీఖు	31/10/24
ముందు అట్ట	Yes
వెనుక అట్ట	Yes
మొత్తం పేజీలు	49
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	Ci, Bci
	NO
తయారు చేసినది	Triveni
పేజీలు విడదీసినది	Triveni
	S.Lakshmi
పరీక్ష చేసినది	RUKSANA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good